www.aryadvi.com
తెలుగు దినపత్రిక
News Daily
# ఆర్యాద్వి
మంగళవారం
20-10-2026
అక్షర సత్యం - ప్రజా సాక్ష్యం
సంపుటి (VOLUME) : 1 సంచిక (ISSUE): 1
పేజీలు : 8
వెల : 1/-
Simultaneously Published from: Hyderabad | Vijayawada | Visakhapatnam




మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..



## సెలవు

పాఠకులకు, ప్రకటన కర్తలకు, మిత్రులు, శ్రేయోభిలాషులకు దసరా శుభాకాంక్షలు. దసరా పండుగ సందర్భంగా మంగళవారం పత్రికకు సెలవు. బుధవారం పునః ప్రారంభం.



# తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్..
# పొదుపు బాటలో ప్రభుత్వం!

- ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో పెరిగిన విద్యుత్ డిమాండ్
- ప్రభుత్వ కార్యాలయాల్లో ఏసీల వాడకంపై ఆంక్షలు విధింపు
- పరిశ్రమలకు విద్యుత్ కోతలు ఉండవని స్పష్టం చేసిన సర్కార్
- తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు, కార్యాచరణ
- హైదరాబాద్‌లో అక్రమ నీటి మోటార్లపై ప్రత్యేక డ్రైవ్

**ఎల్‌నినో ప్రభావంతో తెలంగాణలో విద్యుత్, నీటి వినియోగం గణనీయంగా పెరిగింది. మరోవైపు ఉత్పత్తి, లభ్యత ఆశించిన స్థాయిలో లేకపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. పొదుపు చర్యలతో పాటు ప్రత్యామ్నాయ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేసేందుకు సిద్ధమైంది. ఇందులో భాగంగా ప్రభుత్వ కార్యాలయాల్లో విద్యుత్ వాడకాన్ని తగ్గించాలని ఆదేశాలు జారీ చేసింది. సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఈ మేరకు ఉన్నతాధికారులకు స్పష్టమైన సూచనలు చేశారు.**

పగటి వేళల్లో అత్యవసరమైతే తప్ప ఎయిర్ కండిషనర్లను (ఏసీ) వినియోగించవద్దని, వాటిని కూడా 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత వద్దే నిర్వహించాలని స్పష్టం చేశారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఏసీల వినియోగాన్ని గణనీయంగా తగ్గించాలని ఆదేశించారు. రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ఆశాజనకంగా లేనప్పటికీ, వ్యవసాయ, గృహ అవసరాలకు నిరంతరాయంగా సరఫరా అందిస్తున్నామని తెలిపారు. పరిశ్రమలకు ఎలాంటి విద్యుత్ కోతలు విధించడం లేదని, పారిశ్రామిక యాజమాన్యాలు ఆందోళన

- మిగతా 2లో



## ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్

- ఇబ్రహీంపట్నంలో నూతన కమిషనరేట్ ప్రారంభం
- ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషికి సీఎం శుభాకాంక్షలు
- కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్, పలువురు ప్రజాప్రతినిధులు

ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఫ్యూచర్ సిటీ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అందులో భాగంగా ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ ను ప్రారంభించారు సీఎం రేవంత్ రెడ్డి. ఫ్యూచర్ సిటీ పర్యటనలో భాగంగా 2026 అక్టోబర్ 19న కొత్త కమిషనరేట్ ను ప్రారంభించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేసిన ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ను ప్రారంభించారు. ఫ్యూచర్ సిటీ సీపీ తరుణ్ జోషిని వేదమంత్రాల నడుమ కుర్చీలో కూర్చోబెట్టారు. అనంతరం ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు మల్ రెడ్డి రంగరెడ్డి, కాలే యాదయ్య, ప్రకాష్ గౌడ్, కార్పొరేషన్ చైర్మన్లు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



## అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక దసరా

చెడుపై మంచి సాధించిన గెలుపు, అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక జరుపుకునే విజయదశమి పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రజలకు ముఖ్యమంత్రి

- మిగతా 2లో



## రేవంత్ సర్కార్‌పై రూ.50 వేల కోట్ల స్కాం ఆరోపణలు..
### సీబీఐ విచారణకు క్రిశాంక్ డిమాండ్

- రేవంత్ రెడ్డి సోదరుడి ప్రమేయంతోనే భూముల సెటిల్‌మెంట్లు అని క్రిశాంక్ ఆరోపణ
- సెక్షన్ 22ఏ భూముల వ్యవహారంలో భారీగా అక్రమాలు జరిగాయని వెల్లడి
- బీజేపీ ఎందుకు మౌనంగా ఉందని ప్రశ్న

హైదరాబాద్ :తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నేత మన్నె క్రిశాంక్ సంచలన ఆరోపణలు చేశారు. రాష్ట్రంలో ప్రభుత్వ అండతో రూ. 50,000 కోట్ల విలువైన కుంభకోణాలు జరిగాయని, ముఖ్యంగా సెక్షన్ 22ఏ కింద ఉన్న నిషేధిత భూముల వ్యవహారంలో భారీగా అవినీతి చోటుచేసుకుందని ఆయన ఆరోపించారు. ఈ వ్యవహారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఎలాంటి పాత్ర లేకపోతే, వెంటనే సీబీఐ విచారణకు ఆదేశించాలని ఆయన డిమాండ్ చేశారు.

- మిగతా 4లో

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు.. శాంతికి తాము సిద్ధమేనన్న జెలెన్‌స్కీ

- శాంతి ప్రయత్నాలకు క్షిపణులే రష్యా సమాధానమన్న జెలెన్‌స్కీ
- రష్యా దాడికి తాము ఎదురుదాడి చేయాల్సి వస్తోందని వెల్లడి
- మిత్ర దేశాల నుంచి క్షిపణి హెచ్చరికలు అందలేదన్న ఉక్రెయిన్



యుద్ధాన్ని ముగించేందుకు తాము దౌత్యపరమైన అన్ని ప్రయ త్నాలు చేస్తున్నప్పటికీ, రష్యా మాత్రం దాడులతోనే సమాధాన మిస్తోందని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలెన్‌స్కీ ఆవేదన వ్యక్తం చేశారు. కాల్పుల విరమణ కోసం వచ్చిన ప్రతి ప్రతిపాదనకు తాము సానుకూలంగా స్పందించామని,

- మిగతా 4లో

## అమెరికాలోని ప్రతి పిల్లాడికీ స్పేస్‌ఎక్స్ షేరు..
### ఎలాన్ మస్క్ ప్రకటన



ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ కీలక ప్రకటన చేశారు. అమెరికాలోని ప్రతి పిల్లాడికీ వచ్చే ఏడాది తన స్పేస్‌ఎక్స్ కంపెనీకి చెందిన షేరును ఇవ్వనున్నట్లు ప్రకటించారు.

- మిగతా 4లో



## రోడ్డు వేస్తే ట్రాక్టర్ తో దున్నేశారు.. ఇదేం పైశాచిక ఆనందం?

- ఉండవల్లిలో చంద్రబాబు మీడియా సమావేశం
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో ప్రత్యర్థి పార్టీపై చంద్రబాబు విమర్శలు
- మెగా డీఎస్సీని అడ్డుకోవాలని వందల సార్లు కోర్టుకెళ్లారని ఆగ్రహం
- 55 సేవలపై ప్రజల అభిప్రాయం తీసుకుని జవాబుదారీతనం పెంచామని వెల్లడి
- విధ్వంసంతో దెబ్బతిన్న ఏపీ బ్రాండ్‌ను పునరుద్ధరించామని ఉద్ఘాటన

- మిగతా 4లో



## హైదరాబాద్‌లో హనీట్రాప్
### యువతిలా నటిస్తూ పోలీసుకే వల వేసిన కేటుగాడు

- యువతిలా నటిస్తూ పోలీసు అధికారిని బ్లాక్‌మెయిల్ చేసిన పవన్ అరెస్ట్
- వాట్సాప్‌లో పరిచయం పెంచుకుని డబ్బు డిమాండ్ చేసిన నిందితుడు
- వందల మంది బాధితులు ఉన్నట్టు పోలీసుల దర్యాప్తులో వెల్లడి
- ఇతర రాష్ట్రాలు, దుబాయ్‌లోనూ బాధితులు ఉన్నట్టు గుర్తింపు
- నిందితుడి ఫోన్‌లో వేలకొద్దీ వాట్సాప్ చాటింగ్‌లు బట్టబయలు

హైదరాబాద్ నగరంలో సంచల నం సృష్టించిన హనీట్రాప్ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. యువతిగా నటిస్తూ వాట్సాప్‌లో పరిచయం పెంచుకుని, ఏకంగా ఒక పోలీసు అధికారిని

- మిగతా 4లో

## పాకిస్థాన్‌లో ఆకలి కేకలు..
### నివేదికలో షాకింగ్ విషయాలు!

- ప్రపంచ ఆహార సంక్షోభంలో టాప్ 10 దేశాల జాబితాలోకి పాకిస్థాన్
- ఆర్థిక ఒత్తిళ్లు, వాతావరణ మార్పులతో తీవ్రమవుతున్న ఆహార అభద్రత
- దేశంలో నాలుగింట ఒక కుటుంబం ఆహార కొరతను ఎదుర్కొంటోందని వెల్లడి
- గోధుమలు, బియ్యం, మాంసం వంటి వాటి వినియోగం క్షీణత
- గ్రామీణ ప్రాంతాల్లో కోటి మందికి పైగా ప్రజలు తీవ్ర ఆహార సంక్షోభంలో ఉన్నట్లు నివేదిక




- మిగతా 4లో

## నారా లోకేశ్‌తో మిజోరం సీఎం భేటీ..
### మున్సిపల్ ఎన్నికలపై విపక్షాలకు లోకేశ్ చురకలు



- ఉండవల్లిలో మంత్రి లోకేశ్‌ను కలిసిన మిజోరం సీఎం లాల్‌దుహోమా
- పురపాలక ఎన్నికలకు 22,800కు పైగా నామినేషన్లు దాఖలయ్యాయన్న లోకేశ్
- ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందని చెప్పడానికి నిదర్శనమని వ్యాఖ్య

- మిగతా 4లో



## కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలు..
## కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు

- మహేశ్ గౌడ్, పొంగులేటి, వంశీకృష్ణకు బీఆర్ఎస్ నోటీసులు
- నోటీసులు జారీ చేసిన సోమ భరత్ కుమార్
- సోషల్ మీడియా పోస్టులు తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్
- తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని సూచన
- స్పందించకపోతే పరువు నష్టం సహా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

- మిగతా 4లో

## కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు నీటి మళ్లింపు ఆరోపణలు.. కాంగ్రెస్ నేతలకు లీగల్ నోటీసులు

కొండపోచమ్మ సాగర్ నీటిని మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఫామ్‌హౌస్‌కు మళ్లించారంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపిస్తూ ముగ్గురు కాంగ్రెస్ నేతలకు బీఆర్ఎస్ లీగల్ నోటీసులు జారీ చేసింది. తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ గడ్డం వంశీకృష్ణకు ఈ నోటీసులు పంపించింది. బీఆర్ఎస్ జనరల్ సెక్రటరీ, లీగల్ సెల్ ఇన్‌ఛార్జ్ సోమ భరత్ కుమార్ వీటిని జారీ చేశారు.కేసీఆర్ ప్రతిష్ఠను దెబ్బతీసేలా నిరాధార ఆరోపణలు చేస్తున్నారని బీఆర్ఎస్ లీగల్ సెల్ పేర్కొంది. ఈ అంశంపై ఇప్పటికే 'వెలుగు' దినపత్రిక యాజమాన్యం, ఎడిటర్‌కు నోటీసులు పంపించినట్లు తెలిపింది. అదే ప్రచారాన్ని కొనసాగిస్తున్నారనే ఆరోపణతో తాజాగా ముగ్గురు కాంగ్రెస్ నేతలకు కూడా నోటీసులు జారీ చేసింది.తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఈ అంశానికి సంబంధించి చేసిన పోస్టులను వెంటనే బేషరతుగా తొలగించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. తప్పుడు ప్రచారాన్ని ఉపసంహరించుకోవాలని నోటీసుల్లో పేర్కొంది. తెలంగాణ సాగునీటి ప్రాజెక్టులపై ఆధారాలు లేని ఆరోపణలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలను సహించబోమని స్పష్టం చేసింది.నోటీసులకు స్పందించకపోతే పరువు నష్టం సహా వర్తించే చట్టాల ప్రకారం తదుపరి న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని బీఆర్ఎస్ లీగల్ సెల్ హెచ్చరించింది.

## అమెరికాలోని ప్రతి పిల్లాడికీ స్పేస్‌ఎక్స్ షేరు..

- మొదటి పేజి తరువాయి

ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. ప్రముఖ కృత్రిమ మేధ సంస్థ ఆంత్రోపిక్.. కంపెనీలోని 5 శాతం వాటాను ప్రజాప్రయోజనాల కోసం తాను ఏర్పాటు చేసే నిధికి కేటాయించనున్నట్లు ప్రకటించిన వేళ ఎలాన్ మస్క్ స్పందిస్తూ ఈ ప్రకటన చేశారు.'ఆంత్రోపిక్ పబ్లిక్ బెనిఫిట్ ఫండ్' ను ఏర్పాటు చేసి సంస్థలో 5 శాతం వాటాలను ఈ నిధికి కేటాయిస్తామని ఆంత్రోపిక్ ప్రకటించింది. సంస్థ విలువ 50 శాతం పెరిగిన ప్రతిసారీ మరో 2 శాతం వాటాలను అదనంగా కేటాయించనున్నట్లు తెలిపింది. ఈ నిధి ద్వారా స్వచ్ఛంద సంస్థలకు విరాళాలు అందించడంతో పాటు అవసరమైన వర్గాలకు ఆర్థిక సాయం చేయనున్నారు. అదేవిధంగా ఏఐ వల్ల ఉద్యోగ రంగంలో వచ్చే మార్పులు, కార్మికులు ఎదుర్కొనే సమస్యల పరిష్కారంపైనా దృష్టి సారించనున్నట్లు ఆంత్రోపిక్ తెలిపింది.ఈ ప్రకటనపై మస్క్ స్పందిస్తూ.. వాటాలను ప్రజానిధికి చేరవేసే బదులు.. నేరుగా ప్రజలకే ఇవ్వాలని ఎక్స్ వేదికగా సూచించారు. 'నేను కూడా భవిష్యత్‌లో ఇదే చేయబోతున్నా' అని ప్రకటించారు. ఏ కంపెనీ షేర్లు అనేది తొలుత వెల్లడించనప్పటికీ.. తర్వాత స్పేస్‌ఎక్స్‌లో ఒక్కో షేరును ప్రతి పిల్లాడికీ కేటాయించనున్నట్లు మరో పోస్ట్‌లో పేర్కొన్నారు. ప్రస్తుత స్పేస్ ఎక్స్ షేరు ధర 146.03 డాలర్లు ఉంది.

## అధర్మంపై ధర్మం సాధించిన విజయానికి ప్రతీక దసరా

- మొదటి పేజి తరువాయి

ఎ. రేవంత్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో దసరాకు ప్రత్యేక స్థానం ఉందని అన్నారు. దసరా పండుగ మనకు ధైర్యం, ధర్మం, సత్యం, ఐకమత్యం, ఆత్మవిశ్వాసం వంటి గొప్ప విలువలను బోధిస్తుందని పేర్కొన్నారు.మనలోని అహంకారం, అసూయ, ద్వేషం, అన్యాయం వంటి చెడు లక్షణాలను తొలగించుకుని, ప్రేమ, కరుణ, సోదరభావం, మానవత్వంతో కూడిన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఈ పండుగ సందేశమిస్తోందని వివరించారు.ఈ విజయదశమి ప్రతి ఇంటా ఆనందాల పూలు పూయించాలని, ప్రతి కుటుంబంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, ప్రతి ఒక్కరికీ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, విజయాలు చేకూరాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానని చెప్పారు.రాక్షసుడైన మహిషాసురుడిని సంహరించి దుష్టశక్తులపై విజయం సాధించిన అమ్మవారి శక్తిని, శ్రీరాముడు రావణాసురుడిపై సాధించిన విజయాన్ని ఈ పర్వదినం మనకు గుర్తు చేస్తుందని అన్నారు. తెలంగాణలో దసరా సందర్భంగా జమ్మి చెట్టుకు పూజలు చేయడం, జమ్మి ఆకులను బంగారంగా భావించి పెద్దలకు ఇచ్చి ఆశీర్వాదాలు తీసుకోవడం ప్రత్యేక సంప్రదాయమని గుర్తు చేశారు. ఈ ఆచారం ప్రకృతిని ప్రేమించాలని, పెద్దలను గౌరవించాలని చాటి చెబుతుందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు.

## నారా లోకేశ్‌తో మిజోరం సీఎం భేటీ..

ఆంధ్రప్రదేశ్ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్‌తో మిజోరం ముఖ్యమంత్రి లాల్‌దుహోమా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయనకు ఉండవల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో లోకేశ్ సాదరంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా లాల్‌దుహోమాను శాలువాతో సత్కరించి, ప్రత్యేక జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఇరువురు నేతలు పలు కీలక అంశాలపై చర్చించుకున్నారు.ఇదిలా ఉండగా, రాష్ట్రంలో జరుగుతున్న పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రి లోకేశ్ ఎక్స్ వేదికగా స్పందించారు. ఈ ఎన్నికలకు రికార్డు స్థాయిలో 22,800కు పైగా నామినేషన్లు దాఖలయ్యాయని తెలిపారు. రాష్ట్రంలోని ప్రతి పార్టీ, ప్రతి వర్గం, నలుమూలల నుంచి అభ్యర్థులు ముందుకు రావడం ప్రజాస్వామ్యం వర్ధిల్లుతోందనడానికి నిదర్శనమని అన్నారు.ఒక్క ఓటు కూడా పడకముందే అక్రమాలు జరిగాయని ఆరోపించే వారు ఒక విషయం గుర్తుంచుకోవాలని లోకేశ్ హితవు పలికారు. "ఎన్నికల్లో గెలుపు క్షేత్రస్థాయిలో ఉంటుంది కానీ, పత్రికా సమావేశాల్లో కాదు. ప్రజలను ఎదుర్కోండి, ప్రజలే ఫలితాలను నిర్ణయిస్తారు" అని ఆయన స్పష్టం చేశారు. అక్టోబర్ 28న పోలింగ్, 30న ఓట్ల లెక్కింపు జరగనున్న విషయం తెలిసిందే.

# తెలంగాణపై ఎల్‌నినో ఎఫెక్ట్.. పొదుపు బాటలో ప్రభుత్వం!

- మొదటి పేజి తరువాయి

చెందాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. అన్ని థర్మల్ పవర్ స్టేషన్లలో విద్యుత్ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి పెంచేందుకు చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.ఎల్‌నినో ప్రభావంతో భవిష్యత్తులో తలెత్తే తాగునీరు, విద్యుత్ కొరతను నివారించేందుకు క్షేత్రస్థాయిలో పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంజయ్ జాజు సూచించారు. ఈ అంశంపై త్వరలోనే అఖిలపక్ష సమావేశం, కేబినెట్ సబ్-కమిటీ భేటీ నిర్వహిస్తామని ఆయన వెల్లడించారు.

**నీటి కష్టాలు.. అక్రమ మోటార్లపై ఉక్కుపాదం**

స్థానిక నీటి వనరుల నుంచి వ్యవసాయానికి అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడేస్తుండటంతో, విద్యుత్ లోడ్ పెరిగి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయని ఇంధన శాఖ అధికారులు సమావేశంలో వివరించారు. మంజీరా, సింగూరు రిజర్వాయర్ల నుంచి నీటి లభ్యత లేకపోవడంతో, అక్కడి నుంచి అందాల్సిన 110 మిలియన్ గ్యాలన్ల నీటిని మిషన్ భగీరథ (60 MGD), కృష్ణా నది వంటి ప్రత్యామ్నాయ వనరుల ద్వారా సర్దుబాటు చేస్తున్నట్లు తెలిపారు.

హైదరాబాద్‌లో తాగునీటి అవసరాలకు తప్ప నిర్మాణాలకు, ఇతర పనులకు కొత్త బోర్ల తవ్వకానికి అనుమతులు మంజూరు చేయవద్దని ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ స్పష్టం చేశారు. నగరంలో మున్సిపల్ నల్లా కనెక్షన్లకు అక్రమంగా మోటార్లు బిగించి నీటిని తోడుతున్న వారిపై 'హైడ్రా' సహకారంతో ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నవంబర్ 1 నుంచి నిర్మాణాలకు గ్రీన్ ట్యాంకర్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని (ఎస్‌టీపీ వాటర్) సరఫరా చేయనున్నట్లు ప్రకటించారు. రంగారెడ్డి జిల్లాలో భూగర్భ జలాలు గణనీయంగా తగ్గుతున్నాయని, తాగునీటి కొరత రాకుండా ప్రత్యామ్నాయ ప్రణాళికలు అమలు చేస్తున్నామని మరో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ తెలిపారు.

## హైదరాబాద్‌లో ఫేక్ నంబర్ ప్లేట్లపై ఉక్కుపాదం.. 100 వాహనాలు సీజ్

- మొదటి పేజి తరువాయి

హైదరాబాద్ నగరంలో నకిలీ, ట్యాంపర్ చేసిన నంబర్ ప్లేట్లతో తిరుగుతున్న వాహనాలపై ట్రాఫిక్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. వాహనాల గుర్తింపును దాచిపెట్టడం, ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించడం, చట్టపరమైన చర్యల నుంచి తప్పించుకోవడం వంటి చర్యలకు పాల్పడుతున్న వారిని కట్టడి చేసేందుకు చేపట్టిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గత 8 నెలల్లో 100 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు 100 క్రిమినల్ కేసులు కూడా నమోదు చేసినట్లు అధికారులు వెల్లడించారు.నకిలీ నంబర్ ప్లేట్ల వినియోగంపై ఫిర్యాదులు పెరుగుతున్న నేపథ్యంలో ఈ స్పెషల్ డ్రైవ్‌ను ముమ్మరం చేసినట్లు పోలీసులు తెలిపారు. స్వాధీనం చేసుకున్న వాహనాల్లో 88 ద్విచక్ర వాహనాలు, 12 నాలుగు చక్రాల వాహనాలు ఉన్నాయని పేర్కొన్నారు.

ఈ విషయంపై ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్, డి. జోయల్ డేవిస్ మాట్లాడుతూ.. నకిలీ రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను ఉపయోగించడం చట్టరీత్యా తీవ్రమైన నేరమని స్పష్టం చేశారు. "ఇది ట్రాఫిక్ నియంత్రణ, నేరాల నివారణ, ప్రజా భద్రతకు పెను సవాలుగా మారుతోంది. ఇటువంటి చర్యల వల్ల వాహనాల అసలు గుర్తింపును దాచిపెట్టడం, నేరాల దర్యాప్తుకు ఆటంకం కలిగించడం, చట్టపరమైన జవాబుదారీతనం నుంచి తప్పించుకోవడం వంటివి సులభమవుతాయి" అని ఆయన వివరించారు.మోటారు వాహనాల చట్టం-1988, కేంద్ర మోటారు వాహన నిబంధనలు-1989 ప్రకారం నిర్దేశించిన ప్రమాణాలకు అనుగుణంగానే వాహనదారులు నంబర్ ప్లేట్లను అమర్చుకోవాలని ఆయన తేల్చిచెప్పారు. హై-సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్ (హెచ్ఎస్ఆర్పీ) నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు. అసలు రిజిస్ట్రేషన్ నంబర్‌ను దాచిపెట్టేలా నకిలీ నంబర్లు, అంకెలను మార్చడం, అనుమతి లేని ఫాంట్లు, రకరకాల స్టిక్కర్లు వాడటం వంటివి చట్టవిరుద్ధమని హెచ్చరించారు.భవిష్యత్తులో కూడా ఇలాంటి స్పెషల్ డ్రైవ్‌లను కొనసాగిస్తామని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు. వాహనదారులు చట్టప్రకారం నంబర్ ప్లేట్లను ఉపయోగించాలని, ఎవరైనా అనుమానాస్పద నంబర్ ప్లేట్లతో కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# రేవంత్ సర్కార్‌పై రూ.50 వేల కోట్ల స్కాం ఆరోపణలు..

- మొదటి పేజి తరువాయి

తెలంగాణ భవన్ లో మీడియాతో క్రిశాంక్ మాట్లాడుతూ... ఈ భూ సెటిల్‌మెంట్ల వెనుక సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కృష్ణారెడ్డి ఉన్నారని ఆరోపించారు. ఎమ్మెల్యేలను బెదిరించడమే కాకుండా, భూదందాల్లో ఆయన కీలక పాత్ర పోషిస్తున్నారని వ్యాఖ్యానించారు. చేవెళ్ల పరిధిలోని చందన్‌వల్లి గ్రామంలో సర్వే నంబర్ 363లోని అసైన్డ్ భూమిని వ్యవసాయ భూమిగా మార్చి, ఆర్9 కన్‌స్ట్రక్షన్స్ పేరుపై రిజిస్ట్రేషన్ చేశారని తెలిపారు. ఈ కంపెనీలో కృష్ణారెడ్డి భాగస్వామిగా ఉన్నారని ఆరోపించారు. ఇలాంటి భూ కబ్జాల కోసమే సెక్షన్ 22ఏను వాడుకుంటున్నారని అన్నారు.

నియోజకవర్గానికి నిధులు కావాలంటే కాంగ్రెస్ కండువా కప్పుకోవాలని పోచారం శ్రీనివాస్ రెడ్డి చెప్పిన విషయాన్ని ఈ సందర్భంగా క్రిశాంక్ గుర్తుచేశారు. ఇదే సమయంలో ఒక ఆసుపత్రి అమ్మకం, మ్యాక్స్‌బిన్ ఫార్మా, మైండ్‌వాల్ట్ కార్పొరేట్ స్కూళ్లతో సీఎం కుటుంబ సభ్యులకు ఉన్న సంబంధాలపై కూడా ఆయన ప్రశ్నలు లేవనెత్తారు. ఈ ఆరోపణలపై బీజేపీ మౌనంగా ఉండటాన్ని కూడా ప్రశ్నించారు. ఈ కుంభకోణాలపై తమ వద్ద ఉన్న అన్ని పత్రాలు, డైరెక్టర్ల వివరాలు, వాటాల సమాచారాన్ని సీబీఐకి సమర్పించడానికి బీఆర్ఎస్ సిద్ధంగా ఉందని, దమ్ముంటే విచారణకు ఆదేశించాలని ముఖ్యమంత్రికి సవాల్ విసిరారు.

# రోడ్డు వేస్తే ట్రాక్టర్ తో దున్నేశారు.. ఇదేం పైశాచిక ఆనందం?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యర్థి పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. తమ ప్రభుత్వం వేసిన రోడ్డును కొందరు ట్రాక్టర్‌తో దున్నేశారని, ఇది వారి పైశాచిక ఆనందానికి, ఉన్మాదానికి నిదర్శనమని తీవ్రంగా మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఉండవల్లిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఈరోజు టీవీలో చూశాను. మేం రోడ్లు వేస్తే, ఆ రోడ్డును ట్రాక్టర్‌తో దున్నేశారు. ఇది భరించలేక చేస్తున్నారా, లేక ఉన్మాదమో, పైశాచిక ఆనందమో నాకు అర్థం కావడం లేదు" అని చంద్రబాబు వ్యాఖ్యానించారు.ఓవైపు తాము అభివృద్ధి, జవాబుదారీ పాలన అందిస్తుంటే, మరోవైపు కొందరు విధ్వంసానికే ప్రాధాన్యమిస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం 55 రకాల సేవలను అందిస్తోందని, ఆర్టీసీ బస్సులు, ఆసుపత్రులు, అన్నా క్యాంటీన్లు, రేషన్ షాపుల వరకు ప్రతి సేవపైనా ప్రజల అభిప్రాయం తీసుకుంటున్నామని తెలిపారు. ఐవీఆర్ఎస్, క్యూఆర్ కోడ్ ద్వారా ఫీడ్‌బ్యాక్ సేకరించి, అధికారుల పనితీరును సమీక్షిస్తున్నామని అన్నారు. నియోజకవర్గ స్థాయి సమావేశాల్లో అధికారుల ముందే వారి పనితీరుపై ప్రజల అభిప్రాయాలను చదివి వినిపిస్తూ, తప్పు చేస్తే సహించేది లేదని హెచ్చరిస్తున్నామని, ఇంతకంటే జవాబుదారీతనం ఎక్కడా ఉండదని స్పష్టం చేశారు.

రాజకీయ విధ్వంసం కారణంగా కోల్పోయిన 'బ్రాండ్ ఏపీ'ని మళ్లీ పునరుద్ధరించి, పెట్టుబడులకు రాష్ట్రాని నంబర్ వన్ గమ్య స్థానంగా తీర్చిదిద్దామని చంద్రబాబు అన్నారు. గత రెండున్నర ఏళ్లలో రూ.22 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించామని, ఇవి పూర్తయితే 20 లక్షల మందికి ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. రాబోయే రెండేళ్లలో ప్రతి ఇంటికి కుళాయి

ద్వారా తాగునీరు అందించే బృహత్తర కార్యక్రమానికి నాంది పలికామని, దీనివల్ల కరవు పరిస్థితుల్లోనూ నీటి సమస్య ఉండదని చెప్పారు.మెగా డీఎస్సీ విషయంలో ప్రతిపక్షాలు వ్యవహరించిన తీరును చంద్రబాబు తీవ్రంగా తప్పుపట్టారు. "పేద పిల్లలకు ఉద్యోగాలు రాకుండా ఉండేందుకు సుమారు 200-300 సార్లు కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని చూశారు. మేం పట్టుబట్టి ఉద్యోగాలు ఇస్తే, మాపైనే ఆరోపణలు చేశారు. నిజం నిప్పు లాంటిది. దానితో ఆడుకుంటే మసైపోతారే తప్ప నిలవలేరు" అని హెచ్చరించారు. ఒకప్పుడు ఎడారిగా మారుతుందనుకున్న రాయలసీమ, నేడు తమ ప్రభుత్వ కృషితో 'రాయలసీమ రైజింగ్'గా ఎదుగుతోందని పేర్కొన్నారు. టెక్నాలజీని ఉపయోగించి ప్రజల జీవితాల్లో మార్పు తీసుకురావడమే తమ లక్ష్యమని చంద్రబాబు స్పష్టం చేశారు.

## పాకిస్థాన్‌లో ఆకలి కేకలు.. నివేదికలో షాకింగ్ విషయాలు!

ప్రపంచవ్యాప్తంగా ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న టాప్ 10 దేశాల జాబితాలో పాకిస్థాన్ చేరింది. ఆర్థిక ఒత్తిళ్లు, వాతావరణ మార్పుల వల్ల కలిగే నష్టాలు, సహాయం అందడంలో తగ్గుదల వంటి కారణాలతో ఆ దేశంలో ఆహార అభద్రత రోజురోజుకు తీవ్రమవుతోందని ఒక నివేదిక హెచ్చరించింది. 'ప్రాఫిట్ బై పాకిస్థాన్ టుడే' విశ్లేషణ ప్రకారం.. ప్రపంచవ్యాప్తంగా 47 దేశాల్లో 266 మిలియన్ల మంది తీవ్రమైన ఆకలితో అల్లాడుతున్నారు. ఈ సంఖ్య దశాబ్దం క్రితంతో పోలిస్తే రెట్టింపు కావడం గమనార్హం.తీవ్ర ఆహార సంక్షోభంతో బాధపడుతున్న వారిలో దాదాపు మూడింట రెండొంతుల మంది, అంటే సుమారు 177 మిలియన్ల ప్రజలు కేవలం పది దేశాల్లోనే ఉన్నారు. ఆ జాబితాలో పాకిస్థాన్‌తో పాటు ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, నైజీరియా, కాంగో, సూడాన్, యెమెన్, మయన్మార్, దక్షిణ సూడాన్, సిరియా ఉన్నాయి. జనాభా శాతంతో కాకుండా, ఆకలితో బాధపడుతున్న ప్రజల సంఖ్య ఆధారంగా పాకిస్థాన్‌ను ఈ జాబితాలో చేర్చినట్లు నివేదిక స్పష్టం చేసింది.పాకిస్థాన్‌లోని 51 గ్రామీణ ప్రాంతాల్లో సుమారు 1.06 కోట్ల మంది ప్రజలు తీవ్రమైన ఆహార కొరతను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బలహీన వర్గాలు వాతావరణ మార్పుల ప్రభావానికి ఎక్కువగా గురవుతున్నాయి. 2018-19లో 15.92 శాతంగా ఉన్న మధ్యస్థ, తీవ్ర ఆహార అభద్రత కలిగిన కుటుంబాల సంఖ్య, 2024-25 నాటికి 24.35 శాతానికి పెరిగింది. అంటే.. ప్రస్తుతం దేశంలో దాదాపు ప్రతి నాలుగు కుటుంబాల్లో ఒక కుటుంబం ఆహార కొరతతో ఇబ్బంది పడుతోంది. ఇదే సమయంలో తీవ్రమైన ఆహార అభద్రత 2.37 శాతం నుంచి 5.04 శాతానికి పెరిగి రెట్టింపయింది. పాకిస్థాన్ బ్యూరో ఆఫ్ స్టాటిస్టిక్స్ (పీబీఎస్) గణాంకాల ప్రకారం.. జూన్ 2019 నుంచి జూన్ 2025 మధ్య కాలంలో వినియోగదారుల ధరల సూచీ (సీపీఐ) 117 శాతం పెరగడం ఆర్థిక ఒత్తిళ్లకు అద్దం పడుతోంది. దీనికి తోడు వాతావరణ మార్పుల వల్ల వ్యవసాయ ఉత్పత్తి తగ్గి, గ్రామీణ కుటుంబాల ఆదాయంపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో ప్రజలు ఆహారం కోసం మార్కెట్లపై ఎక్కువగా ఆధారపడాల్సి వస్తోంది. ఈ కాలంలో ప్రజలు గోధుమలు, బియ్యం, పప్పులు, మాంసం, గుడ్లు, పాల వినియోగాన్ని తగ్గించారని, అయితే వనస్పతి నెయ్యి వాడకం మాత్రం 81 శాతం పెరిగిందని నివేదిక పేర్కొంది. ఆదాయం తగ్గడం, ధరలు పెరగడం వంటి కారణాలతో పాక్‌లో ఆహార లభ్యత, కొనుగోలు సామర్థ్యం రెండూ దెబ్బతిన్నాయి.

## ఉక్రెయిన్‌పై రష్యా భీకర దాడులు.. శాంతికి తాము సిద్ధమేనన్న జెలెన్‌స్కీ

- మొదటి పేజి తరువాయి

కానీ రష్యా హింసామార్గం వీడటం లేదని ఆయన ఆరోపించారు.రష్యా సైన్యం బాలిస్టిక్ క్షిపణులు, వివిధ రకాల డ్రోన్లతో కీవ్‌తో పాటు పలు నగరాలపై విరుచుకుపడిందని ఆయన తెలిపారు. ఈ నేపథ్యంలో అనివార్యంగా తాము ఎదురుదాడికి దిగాల్సి వస్తోందని చెప్పారు. విన్నిట్సియా, కీవ్, మైకోలైవ్, ఖార్కివ్, ఒడెస్సా సహా 11 ప్రాంతాల్లోని ఇంధన మౌలిక సదుపాయాల కేంద్రాలే లక్ష్యంగా ఈ దాడులు జరిగాయని, వీటిలో పదికి పైగా కేంద్రాలు ధ్వంసమయ్యాయని జెలెన్‌స్కీ పేర్కొన్నారు."మేం ఈ యుద్ధాన్ని ఎన్నడూ కోరుకోలేదు. గౌరవప్రదంగా యుద్ధాన్ని ముగించేందుకు మా మిత్ర దేశాలు చేసిన ప్రతి ప్రయత్నాన్ని స్వాగతించాం. కానీ రష్యా మాత్రం పదేపదే బాలిస్టిక్ క్షిపణులు, డ్రోన్ దాడులు, హత్యలతోనే ప్రతిస్పందిస్తోంది" అని ఆయన వ్యాఖ్యానించారు. యుద్ధాన్ని ఆపేందుకు లేదా ఉద్రిక్తతలను తగ్గించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఏమాత్రం ఆసక్తి లేదని ఆయన విమర్శించారు.గత కొంతకాలంగా అమెరికా తీసుకుంటున్న కొన్ని నిర్ణయాలు రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు పరోక్షంగా ప్రయోజనం చేకూరుస్తున్నాయని జెలెన్‌స్కీ ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా మాస్కోపై ఉన్న ఆంక్షలను వాషింగ్టన్ సడలించడం, రష్యా నుంచి డీజిల్ దిగుమతి చేసుకునేందుకు ఒప్పందం చేసుకోవడం వంటి చర్యలను ఆయన తప్పుబట్టారు. రష్యా దాడులకు సంబంధించిన నిఘా సమాచారాన్ని గతంలో పంచుకున్న భాగస్వామ్య దేశాలు, ఇప్పుడు ఆ విషయంలో మౌనం వహిస్తున్నాయని వాపోయారు. అమెరికా తయారీ 'పేట్రియాట్' గగనతల రక్షణ వ్యవస్థల కొరత కూడా తమ దేశాన్ని రక్షణ పరంగా మరింత బలహీన పరిచిందని ఆయన పేర్కొన్నారు.

## హైదరాబాద్‌లో హనీట్రాప్

- మొదటి పేజి తరువాయి

బ్లాక్‌మెయిల్ చేసిన పవన్ అనే నిందితుడిని సైదాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. నిందితుడి వలలో వందలాది మంది బాధితులు చిక్కుకున్నట్లు పోలీసులు గుర్తించా రు.పవన్ అనే యువకుడు వాట్సాప్‌లో యువతి పేరుతో నకిలీ ప్రొఫైల్ సృష్టించి, ఒక పోలీసు అధికారితో స్నేహం చేశాడు. చాటింగ్ ద్వారా కొంతకాలం నమ్మకాన్ని కలిగించిన అనంతరం, సదరు అధికారిని బ్లాక్‌మెయిల్ చేస్తూ డబ్బు డిమాండ్ చేయడం ప్రారంభించాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రంగంలోకి దిగిన సైదాబాద్ పోలీసులు సాంకేతిక ఆధారాల సాయంతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.ఈ కేసుకు సంబంధించిన వివరాలను చార్మినార్ డీసీపీ కిరణ్ ఖరే సోమవారం మీడియాకు వెల్లడించారు. నిందితుడిని మీడియా ముందు ప్రవేశపెట్టి, అతని నేర చరిత్రను వివరించారు. నిందితుడి మొబైల్ ఫోన్‌ను విశ్లేషించగా వేల సంఖ్యలో వాట్సాప్ చాటింగ్‌లు లభ్యమయ్యాయి. అతని బాధితుల జాబితాలో వందలాది మంది ఉన్నట్లు ప్రాథమిక దర్యాప్తులో తేలింది.నిందితుడి మోసాల పరిధి కేవలం తెలంగాణకే పరిమితం కాలేదని, ఇతర రాష్ట్రాలతో పాటు దుబాయ్ వంటి విదేశాల్లో ఉన్న వారిని కూడా లక్ష్యంగా చేసుకుని మోసాలకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు. ప్రస్తుతం నిందితుడిని కస్టడీలోకి తీసుకున్నపోలీసులు, ఈ వ్యవహారం వెనుక ఇంకా ఎవరైనా ఉన్నారా అనే కోణంలో లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు: ఆమదాలవలస సిఐ

## సభలు, ర్యాలీలకు ముందస్తు అనుమతి తప్పనిసరి। ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తే క్రిమినల్ కేసులు

**సరుబుజ్జిలి న్యూస్ :**అక్టోబర్ 19:లి ?స్థానిక సంస్థల ఎన్నికలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా, పూర్తి ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే లక్ష్యంగా ఆమదాలవలస సబ్–డివిజన్ పరిధిలో పకడ్బందీ భద్రతా చర్యలు చేపట్టినట్లు సి ఐ సన్యాసి నాయుడు తెలిపారు. ప్రజా ప్రాతినిధ్య చట్టం, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ (ఎంసీసీ ) నిబంధనల ప్రకారం శాంతిభద్రతల పరిరక్షణ చర్యలు తేది.14.10.2026 నుంచి క్షేత్రస్థాయిలో అమల్లోకి వచ్చాయని ఆయన స్పష్టం చేశారు.



**ఈ సందర్భంగా ఆయన జారీ చేసిన కీలక ఆదేశాలు, మార్గదర్శకాలు:**

సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలు: ఆమదాలవలస నియోజకవర్గం వ్యాప్తంగా సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉంది. పోలీస్ శాఖ నుంచి ముందస్తు లిఖితపూర్వక అనుమతి లేకుండా ఎలాంటి బహిరంగ సభలు, సమావేశాలు, ఊరేగింపులు, బైక్ ర్యాలీలు నిర్వహించడం లేదా మైక్ సెట్లు/లౌడ్‌స్పీకర్లు వినియోగించడం చట్టరీత్యా నేరం.

**ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసీసీ ):** గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులు, అభ్యర్థులు మరియు కార్యకర్తలు తప్పనిసరిగా ఎన్నికల నియమావళిని తు.చ. తప్పకుండా పాటించాలి. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులపై అనధికారిక ఫ్లెక్సీలు, బ్యానర్లు, గోడ రాతలను అనుమతించబోము.

**ప్రలోభాలపై నిఘా:** ఓటర్లను ప్రభావితం చేసేందుకు నగదు, మద్యం, బహుమతులు లేదా ఇతర వస్తువుల పంపిణీకి పాల్పడితే తీవ్రంగా పరిగణిస్తాము. అక్రమ రవాణా, నిల్వలపై ప్రత్యేక నిఘా బృందాలు (ఎ ఫ్ ,టి ఎస్ ఎస్ టి ) 24 గంటలూ తనిఖీలు నిర్వహిస్తాయి. నిబంధనలు అతిక్రమించిన వారిపై తక్షణమే క్రిమినల్ కేసులు నమోదు చేస్తాము.

శాంతిభద్రతల పరిరక్షణ: ఎన్నికల వేళ శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా, సోషల్ మీడియా వేదికగా రెచ్చగొట్టే పోస్టులు పెట్టినా, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసినా సహించే ప్రసక్తే లేదు. రౌడీషీటర్లు, పాత నేరస్థుల కదలికలపై నిరంతర నిఘా ఉంటుంది.

"ప్రజాస్వామ్య పండుగలాంటి ఈ ఎన్నికలను శాంతియుత వాతావరణంలో, చట్టబద్ధంగా పూర్తి చేసేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు యంత్రాంగానికి పూర్తిస్థాయిలో సహకరించాలి. చట్టాన్ని చేతుల్లోకి తీసుకునే వారిపై ఎలాంటి ఉపేక్ష లేకుండా కఠిన చర్యలు తీసుకుంటాము."

# మద్యం దుకాణాల్లో సిండికేట్ దందా..

## క్వార్టర్ బాటిల్ పై అదనపు వసూళ్లతో సామాన్యుల దోపిడీ!

## లైసెన్స్ షాపులలోనే ప్రతి బాటిల్ పై 10/ అదనపు వసూళ్ళు...



**సరుబుజ్జిలి న్యూస్ అక్టోబర్ 19:**

నూతన మద్యం విధానం అమల్లోకి వచ్చినప్పటికీ, కొన్ని సరుబుజ్జిలి మండలంలో ప్రాంతాల్లో దుకాణదారుల అక్రమాలు, సిండికేట్ పద్ధతులు సామాన్య వినియోగదారులపై తీవ్ర ఆర్థిక భారాన్ని మోపుతున్నాయి. మండం లో వ్యాప్తంగా పలు ప్రాంతాల్లో మద్యం దుకాణాల యాజమాన్యం కుమ్మక్కై (సిండికేట్ అయి), ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రతి 180 ఎమ్ఎల్ (క్వార్టర్) బాటిల్‌పై 10 నుండి అంతకంటే ఎక్కువగా అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

సిండికేట్ రూపంలో సామాన్యులపై ఒత్తిడి

కొనుగోలుదారులు ఎమ్మార్పీ ధరల గురించి ప్రశ్నిస్తే, దుకాణాల సిబ్బంది దురుసుగా ప్రవర్తించడం, లేదంటే మద్యాన్ని విక్రయించడానికి నిరాకరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. రోజువారీ కూలీలు, చిన్న ఉద్యోగులు, సామాన్య ప్రజలు ఎక్కువగా కొనుగోలు చేసే క్వార్టర్ బాటిళ్లపై ఈ అదనపు వసూళ్ల దందా నిరాటంకంగా సాగుతోంది. ప్రతి బాటిల్‌పై రూ. 10 చొప్పున అదనంగా వసూలు చేయడం ద్వారా దుకాణదారులు రోజుకు వేల రూపాయలను అక్రమంగా ఆర్జిస్తున్నారు.

ప్రభుత్వం మరియు ఎక్సైజ్ శాఖ నిబంధనల ప్రకారం దుకాణాల్లో కేవలం ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించాలి. అయితే, క్షేత్రస్థాయిలో ఏం జరుగుతున్నప్పటికీ స్థానిక ఎక్సైజ్ సిబ్బంది, అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దుకాణదారులపై ఎలాంటి ఆకస్మిక తనిఖీలు చేపట్టకపోవడం, ఫిర్యాదులు చేసినా స్పందించకపోవడం అనుమానాలకు తావిస్తోంది.

మరోవైపు, ప్రజాప్రతినిధులు కూడా ఈ దోపిడీని పట్టించుకోకపోవడం పట్ల సామాన్య ప్రజలు, వినియోగదారుల సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ప్రభుత్వం నిర్దేశించిన ఎమ్మార్పీ ధరలకే మద్యం విక్రయించేలా కఠిన చర్యలు తీసుకోవాలి అని, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న సిండికేట్ దుకాణాలపై ఎక్సైజ్ అధికారులు తక్షణమే దాడులు నిర్వహించి, లైసెన్సులు రద్దు చేయాలి. సామాన్యుల పై బారం మోపి నడ్డివిరుస్తున్న ఈ అదనపు ధరల దోపిడీకి అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు...

# ప్రజాదివాస్‌లో బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన పోలీస్ కమిషనర్ సునీల్ దత్





**ఖమ్మం ప్రతినిధి: అక్టోబర్, 19:**ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఖమ్మం పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే (ప్రజావాణి) కార్యక్రమంలో భాగంగా పోలీస్ కమిషనర్ సునీల్ దత్ పలువురు బాధితుల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా భూ వివాదాలు, కుటుంబ, వ్యక్తిగత సమస్యలతో పాటు ఆర్థిక లావాదేవీలు, భార్యభర్తల సమస్యలపై వచ్చిన పలువురు బాధితులు తమ ఫిర్యాదులను పోలీస్ కమిషనర్‌కు అందజేశారు. ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించిన ఆయన, సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి చట్టపరిధిలో తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత పోలీస్ అధికారులకు సూచించారు.ప్రతి ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. కుటుంబ సమస్యలు, ఆర్థిక వివాదాలు, భూ తగాదాల విషయంలో ఫిర్యాదుల స్వభావాన్ని బట్టి చట్టప్రకారం స్పందించాలని, ప్రజల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకుండా బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని తెలిపారు.ప్రజలకు పోలీస్ శాఖపై నమ్మకం కలిగేలా అధికారులు పనిచేయాలని, ఫిర్యాదుల పరిష్కారంలో పారదర్శకతతో పాటు బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని పోలీస్ కమిషనర్ సూచించారు.

## మండలం ప్రజలకు, ఆమదాలవలస నియోజకవర్గ ప్రజలకు దసరా శుభాకాంక్షలు

### బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు వేల్పుల గోవిందరావు



**అక్టోబరు 19 :** బిజెపి మండలం క్యాంపు కార్యాలయంలో సోమవారం మండలం ప్రజలకు, ఆమదాలవలస నియోజకవర్గ ప్రజలకు బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు గోవిందరావు దసరా శుభాకాంక్షలు తెలిపారు.

ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అయిన విజయదశమి (దసరా) పర్వదినాన్ని పురస్కరించుకుని మండలం ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దుష్టశక్తులుపై దైవిక శక్తులు సాధించిన విజయానికి, ధర్మసంస్థాపనకు దసరా పండుగ నిదర్శనమని పేర్కొన్నారు. జగన్మాత అయిన దుర్గాదేవిఅమ్మ వారి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయుర ఆరోగ్యాలు,అష్టఐశ్వర్యంతో వెల్లివిరియాలని ఆకాంక్షించారు. ?రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకు పోవాలని, ముఖ్యంగా రైతాంగం పాడి పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సంతోషంగా పండుగను జరుపుకోవాలని కోరారు. సమాజంలో శాంతి, సామరస్యం, సౌభ్రాతృత్వం మరింత పరిఢవిల్లాలని, విజయదశమి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ తమ లక్ష్యాలను సాధించి విజయాలు అందుకోవాలని ఆయన ఆకాంక్షించారు.ఈ సందర్భంగా , మండల, గ్రామాలు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## దానవాయిగూడెం 59 వ, డివిజన్ ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేత "చల్లా కృష్ణ"



**దానవాయిగూడెం: అక్టోబర్, 19:** పాలేరు నియోజకవర్గంలో దానవాయిగూడెం 59వ,డివిజన్ సోదరలకు సోదరీమణులకు దసరా శుభాకాంక్షలు తెలియచేసిన ఖమ్మం నగరపాలక కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ "చల్లా కృష్ణ" దసరా శు భాకాంక్షలు తెలుపుతూ

అందరికి మరిన్ని విజయాలు చేకూర్చాలని, అమ్మవారి కటాక్షం ఉండాలని డివిజన్ ప్రజలందరూ సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ అందరికి దసరా పండుగ సందర్భంగా శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలిపారు..

## ఇద్దరికి చూపునివ్వనున్న వెంకటేష్-రమ్య దంపతులు!

### రోడ్డు ప్రమాదంలో దంపతుల మృతి.. కుటుంబ సభ్యుల నిర్ణయంపై అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు ప్రశంసలు..





**సింగరేణి: అక్టోబర్: 19,** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం గాదెపాడు గ్రామానికి చెందిన మధ్యబోయిన వెంకటేష్--రమ్య దంపతులు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడం తీవ్ర విషాదాన్ని నింపింది. అయితే, ఈ విషాద సమయంలోనూ వారి కుటుంబ సభ్యులు దంపతుల నేత్రాలను దానం చేసేందుకు ముందుకు రావడం అందరి హృదయాలను కదిలించింది. వారి నేత్రదానం ద్వారా మరో ఇద్దరికి చూపు లభించే అవకాశం కలగడం అభినందనీయమని పలువురు కొనియాడారు. సోమవారం ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రిలో దంపతుల మృతదేహాలను అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పరామర్శించి ఘనంగా నివాళులర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ.. దంపతుల మృతి తీరని లోటని, ఇలాంటి దుర్ఘటనలు జరగడం అత్యంత బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్ర విషాదంలోనూ నేత్రదానానికి అంగీకరించిన కుటుంబ సభ్యుల నిర్ణయం గొప్పదని, వారి ఉదారత మరో ఇద్దరి జీవితాల్లో వెలుగులు నింపనుందని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు.దంపతుల మృతితో గాదెపాడు గ్రామంతో పాటు కారేపల్లి ప్రాంతంలో విషాదఛాయలు అలుముకున్నాయి. వారి పిల్లలకు, కుటుంబ సభ్యులకు ఈ కష్ట సమయంలో మండల ప్రజలంతా అండగా నిలవాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో సింగరేణి మండల మాజీ ఎంపీపీ బానోత్ దేవల నాయక్, సిపిఎం జిల్లా కొండెబోయిన నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకుడు అడ్డగోడ ఐలయ్య, మాజీ వైస్ ఎంపీపీ కొండబోయిన నాగేశ్వరరావు, బీజేపీ మండల అధ్యక్షుడు మేకల మల్లికార్జున, మాజీ సొసైటీ డైరెక్టర్ కడప పుల్లారావు, వెటర్నరీ డాక్టర్ ఉపేందర్, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని దంపతులకు నివాళులర్పించారు.

## యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా గుర్రం రాకేష్ రెడ్డి

ఖమ్మం ఏదులాపురం మున్సిపాలిటీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఉన్నత విద్యావంతుడు గుర్రం రాకేష్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ బాధ్యతలు దక్కడం పట్ల కాంగ్రెస్ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంత్రి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్ రెడ్డి ఆశీస్సులతో రాకేష్ రెడ్డి ఈ పదవికి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయనకు అభినందనలు తెలియజేస్త,యువతలో ఉన్న శక్తిని ప్రజాసేవకు మళ్లించి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లినప్పుడే నిజమైన నాయకత్వానికి గుర్తింపు లభిస్తుందిఅని పేర్కొన్నారు. యువతను సమన్వయం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని, ప్రజల సమస్యలపై స్పందిస్తూ యువతకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఆయన నాయకత్వంలో యూత్ కాంగ్రెస్ మరింత బలోపేతమై, రానున్న రోజుల్లో ప్రజాసేవలో ప్రత్యేక గుర్తింపు పొందాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

## ముస్లిం మైనార్టీ సంఘం అధ్యక్షుడిగా హుస్సేన్

**ఖమ్మం, :** ఖమ్మం ఏదులాపురం మున్సిపాలిటీ ముస్లిం మైనార్టీ సంఘం అధ్యక్షుడిగా హుస్సేన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ బాధ్యతను అప్పగించిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పాలేరు నియోజకవర్గ క్యాంప్ కార్యాలయ ఇన్‌చార్జి తుంబురి దయాకర్ రెడ్డికి, మద్దులపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ హరినాథ్ బాబుకి, ఏదులాపురం మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కిషోర్ కుమార్ కి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, పెద్దలకు, మిత్రులకు ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. నాపై నమ్మకంతో ముస్లిం మైనార్టీ సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన ప్రతిఒక్కరి నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. మైనార్టీల సమస్యల పరిష్కారానికి, వారి అభ్యున్నతికి నా వంతు కృషి చేస్తాను. అందరినీ కలుపుకొని సంఘాన్ని బలోపేతం చేస్తూ, ప్రజలకు అందుబాటులో ఉంటాను. నాకు సహకరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, మిత్రులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పేర్కొన్నారు. మైనార్టీల సంక్షేమం, ఐక్యత, అభివృద్ధి లక్ష్యంగా అందరి సహకారంతో ముందుకు సాగుతానని హుస్సేన్ స్పష్టం చేశారు.

## పి.ఆర్.టి.యు రాష్ట్ర కార్యదర్శిగా నాళం వెంకటేశ్వర్లు

**ఖమ్మం,** పి.ఆర్.టి.యు రాష్ట్ర కార్యదర్శిగా నాళం వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇటీవల నల్గొండలో నిర్వహించిన పి ఆర్ టి యు రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయనను రాష్ట్ర కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలంలోని ఎం పి పి ఎస్ కట్టకొమ్ము తండ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న నాళం వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయ సంఘంలో సీనియర్ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఆయనకు రాష్ట్రస్థాయి బాధ్యతలు లభించడం పట్ల పి ఆర్ టి యు ఖమ్మం జిల్లా శాఖ, నేలకొండపల్లి మండల శాఖ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు ఉపాధ్యాయులు నాళం వెంకటేశ్వర్లుకు అభినందనలు తెలియజేస్తూ రాష్ట్ర కార్యదర్శిగా ఆయన ఎన్నిక ఉపాధ్యాయ సంఘానికి సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. ఆయన తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## ప్రజావాణికి 33 ఫిర్యాదులు

రంగారెడ్డి జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి (33) ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవికి విన్న విస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ శారదా దేవి మాట్లాడుతూ.. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖ-- 22 , ఇతర శాఖలు - 11, మొత్తం 33 దరఖస్తులు అందాయి. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# నవంబర్ 15 నాటికి వెలుగుమట్ల కాలనీ నిర్మాణాలు పూర్తి చేయాలి...

### రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరరావు





- **అక్టోబర్ నెలాఖరులోగా అన్ని ఇళ్ల స్లాబుల నిర్మాణం పూర్తి చేయాలి**
- **ప్రతి మూడు రోజులకు పనుల పురోగతిపై నివేదిక సమర్పించాలి**
- **నవంబర్ 8 నాటికి ఇళ్లపై సోలార్ రూఫ్‌టాప్ ప్యానెల్ల ఏర్పాటు పూర్తి చేయాలి**
- **డిసెంబర్ 9న ముఖ్యమంత్రి చేతుల మీదుగా వెలుగుమట్ల కాలనీ ప్రారంభోత్సవం**
- **వెలుగుమట్ల కాలనీని పరిశీలించి మీడియా సమావేశం నిర్వహించిన మంత్రి తుమ్మల**

**ఖమ్మం, అక్టోబర్- 19:** వెలుగుమట్ల కాలనీలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో పాటు కాలనీలో చేపడుతున్న అన్ని మౌళిక వసతుల పనులను నవంబర్ 15వ తేదీ నాటికి నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. సోమవారం వెలుగుమట్ల కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్‌తో కలిసి మంత్రి పరిశీలించి, మీడియా సమావేశం నిర్వహించారు.
మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వెలుగుమట్ల కాలనీలో నిర్మాణం ప్రారంభించిన 300 ఇళ్లను నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రతి ఇంటి నిర్మాణ స్థితిగతులు, ప్రస్తుతం జరుగుతున్న పనులు, పూర్తికావాల్సిన పనులు, పనుల పురోగతితో కూడిన నివేదికను ప్రత్యేకంగా సిద్ధం చేసి జిల్లా కలెక్టర్‌కు సమర్పించాలని సూచించారు. ప్రతి రోజూ పనులను పర్యవేక్షిస్తూ, ప్రతి మూడు రోజులకు ఒకసారి పురోగతి నివేదికను కలెక్టర్‌కు అందించాలన్నారు.అన్ని ఇళ్లను ఒకే నమూనాలో, ఆకర్షణీయంగా నిర్మించాలని, ఒకే రంగులో తీర్చిదిద్దాలని సూచించారు. అవసరమైతే అదనపు సిబ్బందిని నియమించి పగలు, రాత్రి పనులు కొనసాగించాలని ఆదేశించారు. అక్టోబర్ నెలాఖరులోగా అన్ని ఇళ్ల స్లాబుల నిర్మాణం పూర్తి చేయాలని, విద్యుత్ పనులను కూడా పూర్తిచేయాలని స్పష్టం చేశారు.

**కాలనీలో అన్ని మౌళిక వసతులు ఒకేసారి పూర్తి చేయాలి:**
ఇళ్ల నిర్మాణంతోపాటు రహదారులు, డ్రైనేజీలు, ఎనిమిది దుకాణాలతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్, బస్తీ దవాఖానా, కమ్యూనిటీ హాల్, అంగన్‌వాడీ కేంద్రం తదితర మౌళిక వసతుల పనులను కూడా నవంబర్ 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.అన్ని పనులను సమాంతరంగా చేపట్టాలని, ఏ పనిలోనూ జాప్యం జరగకుండా చూడాలని పేర్కొన్నారు. కాలనీలోని ప్రతి ఇంటికి త్రాగునీటి పైపులైన్ ఏర్పాటు చేసి, ఇంటి వద్దనే త్రాగునీటి కుళాయి అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కాలనీకి అవసరమైన రహదారులను నిర్మించాలని సూచించారు.మున్సిపల్ కమీషనర్ ప్రతి మూడు రోజులకు ఒకసారి కాలనీని సందర్శించి పనుల నాణ్యత, పురోగతిని స్వయంగా పరిశీలించాలని ఆదేశించారు. అన్ని సౌకర్యాలతో వెలుగుమట్ల కాలనీని ఆదర్శవంతమైన కాలనీగా తీర్చిదిద్దాలని స్పష్టం చేశారు.

**దీపావళి నాటికి సోలార్ రూఫ్‌టాప్ ప్యానెళ్ల ఏర్పాటు:**
కాలనీలోని ప్రతి ఇంటిపై సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థను ఏర్పాటు చేయాలని మంత్రి తెలిపారు. ఇందుకు అవసరమైన అనుమతులను ఇంధన శాఖ కార్యదర్శి ద్వారా పొందేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. నవంబర్ 8వ తేదీ దీపావళి నాటికి సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు సంబంధించిన పనులను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

**డిసెంబర్ 9న ముఖ్యమంత్రి చేతుల మీదుగా కాలనీ ప్రారంభోత్సవం:**
వెలుగుమట్ల కాలనీని డిసెంబర్ 9వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు మంత్రి తెలిపారు. అప్పటికి కాలనీలోని అన్ని ఇళ్లు, రహదారులు, డ్రైనేజీలు, ఇతర మౌళిక వసతులు అందుబాటులోకి రావాలని స్పష్టం చేశారు. కాలనీకి సంబంధించిన పేరును ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం సందర్భంగా ప్రకటిస్తారని తెలిపారు.గతంలో ఇక్కడ జరిగిన పరిణామాలను వివరిస్తూ, పేదల పేరుతో కొంతమంది భూములను ఆక్రమించేందుకు ప్రయత్నించారని, కోర్టు నిర్ణయం ప్రకారం జిల్లా యంత్రాంగం ఆక్రమణలను తొలగించిందని మంత్రి పేర్కొన్నారు.అదే ప్రాంతంలో మోసపోయిన పేదలకు శాశ్వత నివాసాలు కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఇందులో భాగంగా అర్హులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసినట్లు వివరించారు.
పేదలకు న్యాయం చేస్తూ ఆదర్శ కాలనీగా, వెలుగుమట్ల కోట్లాది రూపాయలు వెచ్చించి కొనుగోలు చేసిన కాలనీల్లో ఎలాంటి సౌకర్యాలు ఉంటాయో, అలాంటి సదుపాయాలన్నింటినీ వెలుగుమట్లలోని పేదలకు ప్రభుత్వం కల్పిస్తుందని మంత్రి తెలిపారు. ఇళ్లతోపాటు రహదారులు, డ్రైనేజీలు, బస్తీ దవాఖానా, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాల్, షాపింగ్ కాంప్లెక్స్ వంటి సౌకర్యాలను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు.
పేదలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ఇందిరమ్మ ప్రభుత్వం వెలుగుమట్లలో ఆదర్శవంతమైన కాలనీని నిర్మిస్తోందని అన్నారు. గతంలో జరిగిన దోపిడీని ప్రజలకు తెలియజేయడంతో పాటు, ప్రస్తుత ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం చేస్తున్న కార్యక్రమాలు, వారికి కల్పిస్తున్న సదుపాయాలను కూడా ప్రజలకు స్పష్టంగా వివరించాలని మంత్రి సూచించారు.

**పేదల సంక్షేమమే ప్రభుత్వ పాలనకు ప్రాధాన్యం:**
తెలంగాణ రాష్ట్రంలో పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం భారీ స్థాయిలో నిధులు ఖర్చు చేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కూడా తెలంగాణలో అమలవుతున్న సంక్షేమ పథకాల స్థాయిపై ఆసక్తి వ్యక్తమవుతోందని, ఇటీవల తమిళనాడు పర్యటన సందర్భంగా అక్కడి వారు తెలంగాణలో ఇన్ని సంక్షేమ పథకాలను ఎలా అమలు చేయగలుగు తున్నారని ఆశ్చర్యం వ్యక్తం చేశారని తెలిపారు. పేదల సంక్షేమాన్ని ప్రధాన ఎజెండాగా చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం పాలన సాగిస్తోందని మంత్రి పేర్కొన్నారు.
ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మున్సిపల్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖాదర్ బాబా, ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మన్ హన్మంతరావు, ప్రజాప్రతినిధులు రాయల నాగేశ్వరరావు, దీపక్ చౌదరి, కమర్తపు మురళి, కిషోర్, సాధు, ఇతర ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందిస్తాం

- **ఆర్థిక ఇబ్బందులెదురైనా సంక్షేమ పథకాల అమలు ఆగదు**
- **ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో నిరంతరాయంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం**

**ఖమ్మం ప్రతినిధి: అక్టోబర్, 19:**తెలంగాణలో అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం నిరంతరాయంగా కొనసాగుతుందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గారు స్పష్టం చేశారు. కులం, మతం, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇల్లు అందించే బాధ్యతను ప్రభుత్వం తీసుకుందని, చివరి అర్హుడైన లబ్ధిదారుడికి కూడా న్యాయం జరిగే వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు.దసరా పండుగను పురస్కరించుకొని తన సొంత నియోజకవర్గమైన పాలేరులోని కూసుమంచి క్యాంపు కార్యాలయంలో సోమవారం కూసుమంచి మండలానికి చెందిన రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంత్రి మంజూరు పత్రాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేయాలన్న సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తోందన్నారు. ఎన్నికల సమయంలో ఆకర్షణీయమైన ప్రకటనలు, ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టిన గత ప్రభుత్వాల తరహాలో కాకుండా, ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపడమే ప్రజా ప్రభుత్వ విధానమని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం:
రాష్ట్రవ్యాప్తంగా మొదటి విడతలో 4.50 లక్షల ఇళ్లు, రెండో విడతలో 2.50 లక్షల ఇళ్లు మంజూరు చేయడంతో పాటు, హైదరాబాద్‌లో లక్ష ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని మంత్రి తెలిపారు. నగరంలో ఇందిరమ్మ టవర్స్ నిర్మాణ పనులు సైతం ప్రారంభించామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాలతో పాటు తండాల్లో నివసించే అర్హులైన పేద కుటుంబాలకు కూడా విడతలవారీగా ఇళ్లు మంజూరు చేస్తున్నామని వివరించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.30 లక్షల నుంచి 2.40 లక్షల వరకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఆర్థికపరమైన సవాళు ఉన్నప్పటికీ పేదల సంక్షేమం విషయంలో ప్రభుత్వం వెనుకడుగు వేయబోదని మంత్రి స్పష్టం చేశారు. మూడో, నాలుగో విడతల్లోనూ అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, ఎన్ని విడతలు అవసరమైనా పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు.

**పక్షపాతం లేకుండా పారదర్శకతకు పెద్ద పీట:**
ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక, మంజూరులో ఎలాంటి పక్షపాతానికి తావులేకుండా పారదర్శకతకు పెద్దపీట వేస్తున్నామని మంత్రి తెలిపారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లోనూ అర్హులైన లబ్ధిదారులకు ఇళ్లు మంజూరు చేస్తున్నామని చెప్పారు. పేదరికమే ప్రామాణికంగా అర్హులను గుర్తించి, ప్రభుత్వ సంక్షేమ ఫలాలు చివరి వ్యక్తి వరకు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు

**సంక్షేమమే లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం:**
ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని మంత్రి వివరించారు. సన్నబియ్యం పంపిణీ, కొత్త రేషన్ కార్డులు, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు భరోసా, రైతు రుణమాఫీ, రైతు బీమా వంటి పథకాల ద్వారా పేదలు, రైతులకు అండగా నిలుస్తున్నామని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ మంత్రి గారు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ పీడీ భూక్యా శ్రీనివాస్, కూసుమంచి మండల ఎంపీడీవో జశ్వంత్ కుమార్, తహసీల్దార్ సైదులు, హౌసింగ్ డీఈ, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



# కాంగ్రెస్ తరపున ఆమంచి వ్యక్తిగత పోరాటం

**చీరాల, ,అక్టోబరు 19 (న్యూస్ పల్స్):** ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థల ఎన్నికల సమరం ఆసక్తికరంగా మారుతోంది. ప్రధానంగా అధికార టీడీపీ-కూటమికి, పుంజుకుంటున్న కాంగ్రెస్ పార్టీకి మధ్య హోరాహోరీ పోరుకు రంగం సిద్ధమైంది. మాజీఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆమంచి కృష్ణమోహన్ క్షేత్రస్థాయిలో వేస్తున్న వ్యూహాత్మక అడుగులు చీరాల పురపోరును ఒక్కసారిగా వేడెక్కించాయి. ఇతర పార్టీల నుంచి కీలక నేతలనుచేర్చుకుంటూ కాంగ్రెస్ క్షేత్రస్థాయిలో తన పట్టును బలపరుచుకుంటోంది. ఈ క్రమంలోనే చీరాల రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. చీరాల బీజేపీ పట్టణ అధ్యక్షుడు కొత్త మాసు సురేష్‌తన అనుచరులతో కలిసి ఆమంచి కృష్ణమోహన్ సమక్షంలో అధికారికంగా కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. పొత్తులు, స్థానిక రాజకీయంలో అసంతృప్తి చెంది ఆయన కాంగ్రెస్ వైపు అడుగులు వేసినట్లుతెలుస్తోంది. బొంబే సురేష్ చేరికతో పట్టణ పరిధిలో వ్యాపార, సామాజిక సమీకరణాల్లో కాంగ్రెస్ బలం మరింత పెరిగిందని, స్థానిక పోరులో ఇది కాంగ్రెస్‌కు అదనపు బలాన్ని ఇస్తుందని భావిస్తున్నారు. చీరాలమున్సిపాలిటీలోని మొత్తం 44 వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను బరిలోకి దింపుతున్నట్లు ఆమంచి కృష్ణమోహన్ స్పష్టం చేశారు. ప్రతి వార్డులోనూ బలమైన అభ్యర్థులను నిలబెట్టి, టీడీపీ కూటమికి గట్టిపోటీ ఇచ్చేందుకు ఆయన పక్కా ప్రణాళికతో ముందడుగు వేస్తున్నారు. స్వయంగా రంగంలోకి దిగి వార్డుల వారీగా ఆశావహుల ఎంపిక, ప్రచార వ్యూహాలను ఆమంచి పర్యవేక్షిస్తున్నారు. దీంతో చీరాలపురపాలక పీఠం దక్కించుకునేందుకు కాంగ్రెస్ శ్రేణులు పూర్తిస్థాయిలో సమాయత్తమవుతున్నాయి. అధికార బలంతో పాటు స్థానిక శాసనసభ్యుల మద్దతుతో మున్సిపాలిటీపై పట్టు సాధించాలని టీడీపీ ప్రణాళికలు రచిస్తోంది. ఆమంచి కృష్ణమోహన్ సారథ్యంలోని కాంగ్రెస్ గట్టి సవాలు విసురుతుండటంకొరకరాని కొయ్యగా మారింది. చీరాల మున్సిపల్ ఎన్నికలు కేవలం స్థానిక పోరుగానే కాకుండా, ఇద్దరు కీలక నేతల ప్రతిష్ఠాత్మక సమరంగా మారడంతో ఇక్కడ ఫలితం ఎలా ఉండబోతుందోనన్న ఆసక్తివ్యక్తమవుతోంది. ఆమంచి రాజకీయ భవిష్యత్ కు ఈ ఎన్నికలు చాలా కీలకం.

## నేటి నుంచి లోకల్ ఫైటింగ్స్ 2.0



రాష్ట్రంలో స్థానిక ఎన్నికల రెండో దశకు సోమవారం తెర లేచింది. వరుసగా ఎన్నికల నిర్వహణకు సిద్ధమైన ఎన్నికల సంఘం జడ్పీ, మండల పరిషత్ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల సంగ్రామం ముగిసిన వెంటనే గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఎన్నికల ప్రక్రియ మొదలవడంతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల వాతావరణం అలుముకున్నట్లైంది. సోమవారం మొదలు కానున్న జడ్పీ, మండల పరిషత్తు ఎన్నికల ప్రక్రియ వచ్చే నెల 5వ తేదీ వరకు కొనసాగుతుంది.రాష్ట్రంలో 659 జడ్పీటీసీ, 9829 ఎంపీటీసీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదల అయింది. దీనిప్రకారం 21 నుంచి మూడు రోజుల పాటు నామినేషన్లు స్వీకరిస్తారు. 24న నామినేషన్ల పరిశీలన, 27వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు సమయం ఇస్తారు. వచ్చేనెల 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు ఉంటుంది. మొత్తం 659 ఎంపీపీ, 659 జడ్పీటీసీల ద్వారా 28 మంది జడ్పీ చైర్మన్లను ఎన్నుకునేందుకు ఈ ఎన్నికలను నిర్వహిస్తున్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులను ఓటర్లు నేరుగా ఎన్నుకోగా, మండల, జిల్లా పరిషత్ అధ్యక్షులను పరోక్ష విధానంలో ఎన్నుకుంటారు.కాగా, మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో చోటుచేసుకున్న ఉద్రిక్తతల కారణంగా పరిషత్ ఎన్నికల నామినేషన్ కేంద్రాల్లో సీసీ టీవీలు ఏర్పాటు చేయాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. రేపటిలోగా ప్రతి మండల, జిల్లా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇప్పటికే కాంట్రాక్టర్ ను కూడా ఎంపిక చేసినట్లు చెబుతున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పలు చోట్ల అధికార, విపక్షాల మధ్య ఘర్షణలు చోటుచేసుకున్నాయి. కొన్ని ప్రాంతాల్లో పోలీసులు గాలిలోకి కాల్పులు జరపాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో పరిషత్ ఎన్నికల్లో అటువంటి పరిస్థితి తలెత్తకుండా ఎన్నికల సంఘం ముందస్తు జాగ్రత్తలు తీసుకుందని అంటున్నారు.ఇక పరిషత్ ఎన్నికల ప్రక్రియకు రంగం సిద్ధమవడంతో రాష్ట్ర రాజకీయాల్లో మరోసారి సర్దుబాట్లపై చర్చలు మొదలయ్యాయి. రాష్ట్రంలోని మొత్తం 28 జడ్పీ స్థానాలు, 659 ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలను కూటమిలో మూడు పార్టీలు సర్దుబాటు చేసుకోవాల్సివుందని అంటున్నారు. దీంతో మూడు పార్టీలలో ఎవరు ఎన్ని స్థానాలు చొప్పున తీసుకుంటారనే చర్చ ఆసక్తి రేపుతోంది. మున్సిపల్ స్థానాల నిష్పత్తిలోనే సర్దుబాట్లు ఉంటాయా? లేదా? అనేది చూడాల్సివుందని అంటున్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పలుచోట్ల తిరుగుబాట్లు కూటమిలో తలనొప్పులు తెస్తున్నాయని అంటున్నారు. ఈ నేపథ్యంలో జడ్పీల విషయంలో మరింత జాగ్రత్తగా నిర్ణయాలు ఉండాల్సిన అవసరం ఉందని అంటున్నారు.

మరోవైపు చూస్తుండగానే నామినేషన్ల ప్రక్రియకు సమయం ఆసన్నమవడం, ఇప్పటివరకు పొత్తులపై కనీస చర్చలు జరిగినట్లుగా సమాచారం లేకపోవడంపై కూటమిలో జడ్పీ ఆశావహులు ఉత్కంఠతో ఎదురుచూస్తున్నారు. ఏ జడ్పీని ఎవరికి కేటాయిస్తారనేది తెలిస్తే తమ ప్రయత్నాలు చేసుకొందామని భావిస్తున్న నేతలు అధిష్టానానికి దగ్గరగా ఉండే నేతలతో టచ్ లో ఉంటూ ఆరా తీస్తున్నారు. మరోవైపు వందల సంఖ్యలో స్థానాలపై చర్చలు జరగాల్సివుండటంతో అధిష్టానాలు జిల్లా నాయకత్వానికి బాధ్యతలు అప్పగించి రాష్ట్రస్థాయిలో సమన్వయం చేసుకోవాలని ఆలోచిస్తున్నారని అంటున్నారు. మొత్తానికి పరిషత్ ఎన్నికల ప్రక్రియ మొదలుకావడంతో సీట్ల సర్దుబాటు నుంచి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ వరకు అన్ని అంశాలు ఉత్కంఠ రేపుతోంది.

## చైనీయుల ట్రాప్ లో సైనికాధికారి భార్య.. అసలేమైందంటే?

ఆమె సాదాసీదా వ్యక్తి కాదు. ఆర్మీలో ఉన్నత అధికారి భార్య. అంతేకాదు.. విద్యావేత్త కూడా. అలాంటి ఆమె.. విద్య.. పరిశోధన సంబంధించిన కార్యకలాపాలు చేస్తానన్న పేరుతో భారత సైన్యానికి సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని సేకరించటమే కాదు.. చైనా నిఘా అధికారులతో పాటు విదేశీ నిఘా సంస్థలతో సంప్రదింపులు జరుపుతున్నట్లుగా అనుమానిస్తున్నారు. తాజాగా ఆమెపై జమ్ములోని పోలీస్ స్టేషన్ లో ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ ఉదంతం ఇప్పుడు పెను సంచలనంగా మారింది. ఆర్మీలో సీనియర్ అధికారి భార్య పాలపర్తి నాగలక్ష్మిపై షాకింగ్ ఆరోపణలు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారాయి. జమ్ములో భర్తతో కలిసి నివసిస్తున్న ఆమెను తాజాగా పోలీసులు అదుపులోకి తీసుకొని ప్రశ్నిస్తున్నారు. ఆమె ఫోన్ ను స్వాధీనం చేసుకొని విశ్లేషిస్తున్నారు. 2023లో ఐక్యరాజ్యసమితిలో ఐటీ ఇంటర్న్ షిప్ పూర్తి చేసిన ఆమె ప్రస్తుతం ఫ్రీలాన్స్ పరిశోధకురాలిగా వ్యవహరిస్తున్నారు. విదేశీ విశ్వవిద్యాలయాలు.. పరిశోధనా సంస్థలకు చెందిన విద్యావేత్తలుగా నటించిన చైనా ఏజెంట్లు ఆమెను ఆన్ లైన్ లో పరిచయం చేసుకున్నట్లుగా తెలుస్తోంది. మొదట్లో పర్యావరణం.. అంతర్జాతీయ సంబంధాలు లాంటి సాధారణ అంశాలపై ఆమెతో ఆర్టికల్స్ రాయించుకున్న వారు.. ఆ తర్వాత వ్యూహాత్మక.. సైనిక రక్షణ రంగానికి చెందిన సున్నితమైన సమాచారాన్ని ఆమె ద్వారా తీసుకున్నట్లుగా అనుమానిస్తున్నారు.

ఆమె ఇంటెలెక్చువల్ ట్రాప్ లో చిక్కుకుపోయి ఉంటారని అనుమానిస్తున్నారు. దేశ భద్రతతో ముడిపడి ఉన్న అంశాలను ఆమె సేకరించినట్లుగా తెలుస్తోంది. ఫోటోలు.. రహస్య పత్రాలు.. ఎలక్ట్రానిక్ డేటాను సేకరించిన ఆమె.. ఎన్ క్రిప్టెడ్ కమ్యునికేషన్ ద్వారా తనతో సంప్రదింపులు జరిపే వారికి సమాచరాన్ని అందించినట్లుగా అనుమానిస్తున్నారు. ఈ కేసులోని సున్నితత్వం కారణంగా పలు విషయాల్ని వెల్లడించకుండా పోలీసులు గోప్యతను పాటిస్తున్నారు. ఇంతకు ఆమెను ఎలా ట్రేస్ చేశారన్న విషయానికి వెళితే.. ఆసక్తికర అంశాలు కనిపిస్తాయి. భారత రక్షణ రంగానికి.. సరిహద్దు వ్యూహాలకు సంబంధించిన కీ వర్డ్స్ తో ఇంటర్నెట్ లో జరిగే ఎన్ క్రిప్టెడ్ కమ్యూనికేషన్ లపై కేంద్ర నిఘా సంస్థలు నిరంతరం పర్యవేక్షిస్తుంటాయి. ఈ క్రమంలోనే చైనాకు చెందిన కొన్ని ఐపీ అడ్రస్ లు.. అనుమానాస్పద సోషల్ మీడియా ప్రొఫైల్స్ భారత్ లోని ఒకరితో నిరంతరం చాటింగ్ చేస్తున్నట్లుగా నిఘా వర్గాలు గుర్తించాయి. దీంతో అలెర్టు అయిన వారు ఈ చాటింగ్ ఎక్కడి నుంచి జరుగుతుందన్న విషయాన్ని ట్రేస్ చేశారు. జమ్ముకశ్మీర్ లోని సైనిక స్థావరాలకు సమీపంలో ఉన్న గాంధీనగర్ లోని ఒక ఐపీ అడ్రస్ అన్న విషయాన్ని గుర్తించారు.

# చంద్రబాబు పాలనలో ఇలా జరుగుతుందేంటి చెప్మా?




ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికలు చంద్రబాబు పాలనపైనే మచ్చ తెచ్చేలా కనిపిస్తుంది. గతంలో ఎన్నడూ చంద్రబాబు పాలనలో ఇలాంటి పరిస్థితులు లేవు. వైసీపీని గొడ్డలి పార్టీ అని, శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని తరచూ విమర్శించే చంద్రబాబు ప్రస్తుతం జరుగుతున్న ఎన్నికలు ప్రజల్లో చర్చనీయాంశంగామారాయి. సమర్థించుకునే వాళ్లు సమర్థించుకోవచ్చు. చివరకు నామినేషన్లు కూడా వేయకుండా అడ్డుకోకపోవడంతో ఇక ఎన్నికల ప్రక్రియ ఎందుకన్న ప్రశ్న సహజంగా ప్రజలలో ఎదురవుతుంది. స్థానిక సంస్థలలో ఈ రచ్చ ఒకింత టీడీపీకి లాభం కలగవచ్చు. కానీ సాధారణ ఎన్నికల్లో మాత్రం ఈ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ కూటమి ప్రభుత్వానికి మరియు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలనకు పొంతనలేకుండా ఉందని అన్నారు. చంద్రబాబు పాలనలోఎప్పుడూ శాంతి భద్రతలు అదుపు తప్పలేదు. రిటర్న్ గిఫ్ట్ అని అనొచ్చు కాని, వైసీపీకి, టీడీపీకి పెద్దగా తేడా ఏముందన్న ప్రశ్నసహజంగా తలెత్తుంది.

**పాలనపై మచ్చ పడే ప్రమాదం...**

అయితే దీనివల్ల చంద్రబాబుపాలనపై "మచ్చ పడుతుందా" లేదా అనేది ఎన్నికల ప్రక్రియ సాగే విధానం, కూటమి పార్టీల మధ్య సమన్వయం మరియు ఫలితాలపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం ఈ ఎన్నికల విషయంలో రాజకీయంగా జరుగుతున్న ప్రధాన చర్చనీయాంశాలు ఇదే కావడం విశేషం. ముఖ్యమంత్రి చంద్రబాబు స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను నవంబరు 15వ తేదీ నాటికి పూర్తి చేయాలని మంత్రులకు దిశా నిర్దేశం చేశారు. ఏ ఒక్క స్థానం కూడా ఓడిపోవడానికి వీల్లేదని, 100 శాతం స్థానాలు కూటమి కైవసం చేసుకోవాలని స్పష్టం చేశారు. అభ్యర్థుల గెలుపు బాధ్యతను పూర్తిగా ఆయా జిల్లాల ఇన్‌ఛార్జ్ మంత్రులకే అప్పగించారు. ఈ నేపథ్యంలో ఆశించిన స్థాయిలో ఫలితాలు రాకపోతే అది ప్రభుత్వంపై రాజకీయ ఒత్తిడిని పెంచే అవకాశం ఉంది. కానీ నామినేషన్ల నుంచే గొడవలు జరుగుతుండటం, స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరగడంపై పలు అనుమానాలను వైసీపీ నేతలు వ్యక్తం చేస్తున్నారు. ఇక ఎన్నికలు ఎందుకు? నేరుగా తమ అభ్యర్థులను నామినేట్ చేసుకోవచ్చు కదా? అని వారు ప్రశ్నిస్తున్నారు. అనేక చోట్ల హింసాకాండ చెలరేగడంపై తటస్థ ప్రజల్లో ఒకింత ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమయ్యే అవకాశముంది.

**ప్రజా తీర్పు పైనే...**

ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార కూటమిపై విమర్శలు గుప్పిస్తోంది. క్షేత్రస్థాయి లో అధికార పక్షం తమ నేతలపై దాడులకు దిగుతోందని, కూటమి ప్రభుత్వం ఈ ఎన్నికల్లో విజయం సాధించలేదని ఆరోపిస్తోంది. విపక్షాలు సహజంగా ఇలాంటి ఆరోపణలు చేయడం సహజమే. కానీ స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు పై ప్రతిష్టాత్మకంగా తీసుకుంటే నామినేషన్లు వేయించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికలు జరిపి తమకు అనుకూలమైన తీర్పు వస్తే తమ పాలన బాగుందని చెప్పుకోవచ్చు. అలాగే ఓటములు ఎదురయితే తప్పులు సరిదిద్దుకునే వీలుంది. కానీ ఇలా చేసుకుంటే పోతే ప్రస్తుతానికి బాగానే ఉంటుంది కానీ, సాధారణ ఎన్నికల్లో ఇది రివర్స్ అవుతుందని, ప్రజలు కూడా చంద్రబాబు పాలనపై ఉన్న నమ్మకాన్ని కోల్పోతారని వ్యాఖ్యానిస్తున్నారు. సమర్థులైన, అవినీతి మరకలు లేని అభ్యర్థులను నిలబెట్టడం ద్వారా ప్రజల్లో ఉన్న సానుకూలతను నిలబెట్టు కోవాలని చంద్రబాబు వ్యూహాలు రచించాలి. ఈ ఎన్నికలను ప్రజాస్వామ్యబద్ధంగా, ఎలాంటి ఘర్షణలు లేకుండా ప్రశాంతంగా ముగించి, క్లీన్ స్వీప్ సాధిస్తే చంద్రబాబు పాలనా దక్షతకు మరింత బలం చేకూరుతుంది. అలా కాకుండా హింసాత్మక ఘటనలు లేదా అంతర్గత విభేదాలు రచ్చకెక్కితే అది పాలనపై కొంతవరకు మచ్చగా మారే ప్రమాదం ఉంది. అందుకే ఇది చంద్రబాబు జమానా కాదన్న కామెంట్స్ జనంలో వినిపిస్తున్నాయి.

# అధిష్టానానికి అడ్డం తిరిగిన కొలికపూడి.. ఎన్నిసార్లో లెక్కలేదుగా?




టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మరోసారి టీడీపీ నాయకత్వం ఆదేశాలను ధిక్కరించారు. తాను స్వయంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో అభ్యర్థిని ప్రకటించి మరోసారి పార్టీ అధిష్టానానికే సవాల్ విసిరారు. ఎన్టీఆర్ జిల్లా తిరువూరు కూటమి రాజకీయంలో టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తీసుకున్న నిర్ణయం కలకలం రేపుతోంది. రాబోయే పురపాలక ఎన్నికల్లో తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానాన్ని కూటమి పొత్తులో భాగంగా జనసేన పార్టీకి కేటాయించగా, దానికి వ్యతిరేకంగా కొలికపూడి తిరుగుబాటు చేశారు. దీంతో ఆయన తన అనుచరులను రంగంలోకి దించారు. ఈ మేరకు కొలికపూడి శ్రీనివాసరావు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. నామినేషన్ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని ఆయన పోస్టు చేయడం వివాదానికి కారణమయింది. పొత్తులో భాగంగా అనేక స్థానాలు జనసేన, బీజేపీకి కేటాయించారు. అయితే పలు చోట్ల నిరసనలు వినిపించినా ఏకంగా ఎమ్మెల్యే గా ఉండి కొలికపూడి తీసుకున్న నిర్ణయంపై నాయకత్వం కూడకా ఆగ్రహం వ్యక్తం చేస్తోంది.

**వివాదానికి అసలు కారణమిదే...**

తిరువూరు మున్సిపల్ చైర్‌పర్సన్ స్థానానికి కూటమి తరపున జనసేన పార్టీ తమ అభ్యర్థిగా మాధవి పేరును అధికారికంగా ప్రకటించింది. అయితే ఎమ్మెల్యే కొలికపూడి రెబల్ అభ్యర్థిని ప్రకటించారు. ఈ నిర్ణయంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన ఎమ్మెల్యే కొలికపూడి, జనసేన అభ్యర్థికి పోటీగా టీడీపీ తరపున రెబల్ అభ్యర్థిగా పెనుబల్లి నాగ శ్రావణిని రంగంలోకి దించారు. స్వయంగా నామినేషన్ కార్యక్రమానికి హాజరయ్యారు. నిజానికి అనంతపురం లోనూ పార్టీలో విభేదాలతో అక్కడ కార్పొరేషన్ మేయర్ పదవిని టీడీపీ నాయకత్వం బీజేపీకి అప్పగించింది. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్ కు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరికి గత కొంతకాలంగా పొసగడం లేదు. దీంతో మధ్యే మార్గంగా అక్కడ టీడీపీ అధినేత చంద్రబాబు అనంతపురం కార్పొరేషన్ స్థానాన్ని బీజేపీకి కేటాయించారు. తిరువూరులోనూ టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుకు మధ్య చాలా కాలం నుంచి విభేదాలు నడుస్తుండటంతో అక్కడ రెండు గ్రూపులుగా విడిపోవడంతో మధ్యేమార్గంగా జనసేనకు అక్కడ మున్సిపల్ ఛైర్మన్ పదవిని అప్పగించారు.

**తనను లక్ష్యంగా చేసుకుని...**

అనంతపురంలో సజావుగానే ఉన్నా తిరువూరులో మాత్రం కొలికపూడి శ్రీనివాసరావు అధిష్టానికి అడ్డం తిరిగారు. ఆదివారం నాగ శ్రావణితో నామినేషన్ వేయించబోతున్నట్లు, ఈ నామినేషన్ ర్యాలీకి అందరూ రావాలంటూ కొలికపూడి శ్రీనివాసరావు స్వయంగా సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు. పొత్తు ధర్మాన్ని పక్కనబెట్టి జనసేన అభ్యర్థికి పోటీగా కొలికపూడి స్వయంగా అభ్యర్థిని ప్రకటించడంతో తిరువూరు ఎన్డీయే కూటమిలో తీవ్ర ఉద్రిక్తత, చర్చనీయాంశంగా మారింది. కొలికపూడి శ్రీనివాసరావుకు వివాదాలు కొత్త కాదు. గత కొంతకాలంగా అనేక వివాదాల్లో ఆయన ఇరుక్కున్నారు. దీంతో పార్టీ నాయకత్వం పిలిచి హెచ్చరికలు జారీ చేసినప్పటికీ ఆయన తన వైఖరి మార్చుకోలేదు. కానీ కొలికపూడి శ్రీనివాసరావు వాదన మరోలా ఉంది. కేవలం తనను లక్ష్యంగా చేసుకుని తిరువూరు మున్సిపల్ పదవిని జనసేనకు పొత్తు ధర్మాన్ని బూచి చూపుతూ జనసేనకు కేటాయిం చడాన్ని కొలికపూడి శ్రీనివాసరావు తప్పుపడుతున్నారు. మరి కొలికపూడి పై ఈసారి నాయకత్వం ఎలాంటి చర్యలకు దిగుతుందో చూడాలి

# హైదరాబాద్ లో హత్య చేసి.. యూపీలో భారీ దోపిడీకి స్కెచ్ తో దొరికేశారు

కొద్ది నెలల క్రితం హైదరాబాద్ లోని అత్యంత ఖరీదైన ప్రాంతంగా పేరున్న జూబ్లిహిల్స్ ప్రశాసన్ నగర్ లోని ఒక మాజీ ఐఏఎస్ అధికారి సతీమణిని..ఆయన ఇంట్లో పని చేసే వారు దారుణంగా హత్య చేసి.. ఇంట్లోని నగలతో పారిపోవటం తెలిసిందే. పెను సంచలనంగా మారిన ఈ ఉదంతాన్ని అప్పట్లో పోలీసు అధికారులు సీరియస్ గా తీసుకున్నారు. ఆ తర్వాతి కాలంలో ఈ చోరీతో సంబంధం ఉన్న ఒకరిని అదుపులోకి తీసుకున్నా.. దీనికి కారణమైన అసలోళ్లు మాత్రం తప్పించుకు తిరుగుతున్న పరిస్థితి.

అయినప్పటికి పట్టువదలని విక్రమార్కుల మాదిరి శ్రమించిన పోలీసులు తాజాగా వేసిన స్కెచ్ లో దొరికిపోయారు. ఈ ఉదంతంలో ట్విస్ట ఏమంటే.. ఒక భారీ చోరీకి ప్లాన్ చేసిన నిందితులను.. హైదరాబాద్ పోలీసులు పట్టేశారు. మాజీ ఐఏఎస్ సతీమణిని హత్య చేసి చోరీ చేసిన పనోళ్లు.. ఈ దారుణ ఉదంతం తర్వాత పోలీసులకు చిక్కకుండా ఉండేందుకు దేశ సరిహద్దులు దాటేసి నేపాల్ కు వెళ్లి తలదాచుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశం కాని దేశం వెళ్లి



నేరస్తుల్ని అదుపులోకి తీసుకోవటం అంత సాధ్యమయ్యే పని కాదు. దీంతో.. వారి కోసం ఎదురుచూస్తున్న హైదరాబాద్ పోలీసులకు తాజాగా అందుకున్న సమాచారంతో పక్కా ప్లాన్ వేశారు. నేపాల్ కు పారిపోయిన నిందితులు మరో భారీ చోరీకి ప్లాన్ చేశారు. ఇందులో భాగంగా తమ గ్యాంగ్ లోని వారంతా ఒకేసారి ఒకే చోటుకు వెళితే పోలీసులకు చిక్కుతామన్న ఉద్దేశంతో వేర్వేరు ప్రాంతాలకు వెళ్లేలా ప్లాన్ చేసుకున్నారు. ఇందులో భాగంగా సుమారు పదిహేను రోజుల క్రితం యూపీ.. బిహార్.. ఢిల్లీ తదితర ప్రాంతాలకు వేర్వేరుగా వెళ్లి అక్కడ దాక్కున్నారు. మాజీ ఐఏఎస్ సతీమణి హత్య కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకున్న పోలీసులు నిందితుల మీద నెలల తరబడి నిఘా పెట్టారు. ఎట్టకేలకు వారు మళ్లీ భారీ చోరీలకు ప్లాన్ చేసిన వివరాల్ని గుర్తించారు. నేపాల్ నుంచి వచ్చే ఆదేశాలకు అనుగుణంగా భారీ చోరీ చేయటం కోసం ఎదురుచూస్తున్న వారిని వేర్వేరుగా పట్టేసుకున్నారు. తాజాగా హైదరాబాద్ నగర పోలీసుల అదుపులో నలుగురు నిందితులు ఉన్నారు. తాజాగా హైదరాబాద్ కు తీసుకొచ్చి వారిని విచారిస్తున్నారు. మొత్తంగా ఈ కేసుకు సంబంధించి మొత్తం ఏడుగురు నిందితులకు నలుగురు పోలీసుల అదుపులో ఉండగా.. మరో ముగ్గురు నేపాల్ లోనే ఉన్నట్లుగా తెలుస్తోంది. పోలీసుల విచారణలో మరిన్ని వివరాలు బయటకు వచ్చే వీలుంది.

ఆర్యాద్వి సంపాదకీయం Editorial

## గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయ పార్టీలకు జెన్ జీ భయం




### మూడు పార్టీల అభ్యర్థులు...

**కాంగ్రెస్ వేగంగా అభ్యర్థుల ఎంపిక మరియు ఓటర్ల నమోదుపై దృష్టి పెట్టగా, బీజేపీ మరియు బీఆర్ఎస్ పార్టీలు కూడా ప్రత్యేక వ్యూహాలతో యువతను ఆకట్టుకునే ప్రయత్నాలు చేస్తున్నాయి. యువతలో ఉన్న అసంతృప్తిని ఎలా అధిగమించాలనేదానిపై పార్టీలు మథనపడుతున్నాయి. మరొకవైపు బీజేపీకి కూడా జెన్ జీ భయం పట్టుకుంది. దేశ వ్యాప్తంగా ఎన్నికల కమిషన్ వివిధ అంశాలపై ఆందోళనలు జరుగుతున్న నేపథ్యంలో బీజేపీకి యువత హ్యాండ్ ఇస్తారన్న భయంలో బీజేపీ ఉంది. దేశ వ్యాప్తంగా జరుగుతున్న ఆందోళనలు బీజేపీకి భయాన్ని కలిగిస్తున్నాయి. బీఆర్ఎస్ కూడా ఇదే పరిస్థితుల్లో ఉంది. బీఆర్ఎస్ యువతను ఆకట్టుకునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేసింది. గత పదేళ్ల పాలన ప్రభావం ఈ ఎన్నికల్లో చూపుతుందేమోనని కొంత బెరుకు కనపడుతుంది. మొత్తం మీద గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో జెన్ జీ భయం అన్ని రాజకీయ పార్టీలకు వణుకు పుట్టిస్తోంది.**

తెలంగాణలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో జెన్-జీ భయం రాజకీయా పార్టీలకు పట్టుకుంది. ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ లు జెన్ జీ లు ఎవరికి మద్దతుగా నిలుస్తారన్న దానిపై లెక్కలు వేసుకుంటున్నాయి. దేశ వ్యాప్తంగా జరుగుతున్న జెన్ జీ ఉద్యమం ఎవరిని ముంచుతుందన్న ఆందోళనలోరాజకీయ పార్టీలున్నాయి. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలంటే కొత్తగా చేరిన యువత ఓట్లు ఎక్కువగా ఉంటాయి. దేశంలో ఇటీవల జెన్ జీ ఉద్యమం తీవ్ర రూపం దాల్చడంతో మూడు ప్రధాన పార్టీలు భయాందోళనలో పడ్డాయి. యువత ఎవరి వైపు మొగ్గు చూపుతుందన్నది ఈ ఎన్నికల్లో తేలిపోతుందన్నది ఆసక్తికరంగా మారింది. అనేక అంశాలు గెలుపోటములపై ప్రభావం చూపుతాయి. అందుకే రాజకీయ పార్టీలకు జెన్ జీ భయం పట్టుకుంది.

### అనేక సమస్యలు...

నిరుద్యోగ సమస్యలు ప్రధాన ప్రభావం చూపుతుండటంతో ప్రధాన రాజకీయ పార్టీల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఈ ఎమ్మెల్సీ ఎన్నికల్లో దాదాపు మూడు లక్షలకు పైగా కొత్త ఓటర్లు చేరే అవకాశం ఉండటంతో, వీరి మద్దతు ఎటు వైపు ఉంటుందనేది పార్టీల్లో ఉత్కంఠను రేపుతోంది. కొన్ని సర్వేల ప్రకారం... గ్రాడ్యుయేట్ ఓటర్లలో 31 శాతం మంది నిరుద్యోగాన్ని ప్రధాన సమస్యగా పేర్కొన్నారు. జాబ్ నోటిఫికేషన్లు, ఉద్యోగాల భర్తీలో జాప్యం 24 శాతం వంటి అంశాలు కలిపి మొత్తం యాభై ఐదు శాతం వరకు ఉపాధి అంశాల చుట్టూనే చర్చ నడుస్తోంది. రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. పాలనపై ప్రజల, ముఖ్యంగా యువత అభిప్రాయానికి ఈ ఫలితాలను కొలమానంగా భావిస్తున్నారు.

## లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ నెట్ వర్క్ ఏంటో తెలిస్తే షాకవుతారంతే?




**లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ బాలీవుడ్ సెలబ్రిటీలను లక్ష్యంగా చేసుకుంది. లారెన్స్ బిష్ణోయ్ పంజాబ్ కు చెందిన ఒక ప్రసిద్ధ గ్యాంగ్‌స్టర్. లారెన్స్ బిష్ణోయ్ పంజాబ్‌లోని ఫాజిల్కా జిల్లాకు చెందిన వ్యక్తి. ఇతని అసలు పేరు బాల్కరన్ బ్రార్. చండీగఢ్‌లో చదువుకునే సమయంలో విద్యార్థి రాజకీయాల ద్వారా నేర ప్రపంచంలోకి కాలు మోపాడు. జైలులో ఉంటూనే తన నేర సామ్రాజ్యాన్ని విస్తరించాడు. వివిధ నేరాలలో పాల్గొన్న లారెన్స్ బిష్ణోయ్ పై అనేక కేసులు నమోదయ్యాయి. ప్రస్తుతం జైలులో ఉన్నప్పటికీ నేరాలు యధేచ్ఛగా చేస్తున్నాడు. బాలీవుడ్ సెలబ్రిటీలకు వార్నింగ్ లు ఇవ్వడం, వారిపై కాల్పులు జరపడం వంటివి చేస్తున్నారు. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ యధేచ్ఛగా నేరాలను కొనసాగిస్తున్నా వారిని కట్టడి చేయడంలో ప్రభుత్వం విఫలమయిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తాజాగ బాలీవుడ్ యువ నటుడు టైగర్ ష్రాఫ్ పై కాల్పులకు లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ కారణం**

### తాజాగా ముంబయిలో కాల్పులు...

సీనియర్ నటుడు జాకీ ష్రాఫ్ కుమారుడు టైగర్ ష్రాఫ్ పై నిన్న రాత్రి కారులో వస్తుండగా ద్విచక్ర వాహనంపై వచ్చిన వారు కాల్పులు జరిపారు. ఈ కాల్పుల ఘటనలో డ్రైవర్ తో పాటు ఆ దారిలో ప్రయాణిస్తున్న మరో పౌరుడికి గాయాలయ్యాయి. దీంతో పోలీసులు వారిని ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. టైగర్ ష్రాఫ్ కుడి చేతికి, ఛాతి వద్ద స్వల్పంగా గాయాలయ్యాయి. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ ఘటనకు సంబంధించి ప్రముఖ గ్యాంగ్ స్టర్ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ ఈ పని చేసింది తామే అన్నట్లుగా సోషల్ మీడియా ద్వారా ప్రకటనలు చేస్తోంది. గ్యాంగ్ ప్రధాన సభ్యులు అనిల్ పండిట్.. హర్మాన్ సందు మరో సభ్యుడితో కలిసి టైగర్ ష్రాఫ్ లక్ష్యంగా కాల్పులు జరిపినట్లుగా ఆడియో లో చెప్పారు. సల్మాన్ ఖాన్ తో నటించే హీరోలు ఎవరినైనా ఇలాగే టార్గెట్ చేస్తామంటూ గతంలోనే లారెన్స్ గ్యాంగ్ ప్రకటించాడు. లారెన్స్ బిష్ణోయ్ 2015 నుండి వివిధ జైళ్లలో ఉంటున్నప్పటికీ, ప్రస్తుతం గుజరాత్‌లోని సబర్మతి జైలు నుంచి తన గ్యాంగ్‌ను నడిపిస్తున్నాడు.

### ప్రొఫెషనల్ షూటర్లతో...

దేశవ్యాప్తంగా పదకొండు రాష్ట్రాల్లో వీరి నెట్‌వర్క్ విస్తరించింది. ప్రొఫెషనల్ షూటర్లతో కూడిన ఈ ముఠా ఆయుధాల స్మగ్లింగ్, డ్రగ్స్ రవాణా మరియు బలవంతపు వసూళ్లకు పాల్పడుతోంది. కెనడా వంటి విదేశాల్లోనూ ఈ నెట్‌వర్క్ కార్యకలాపాలు సాగిస్తోంది. పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య, మహారాష్ట్ర మాజీ మంత్రి బాబా సిద్ధిఖీ హత్యతో పాటు పలు సంచలన హత్యలు, కాల్పుల కేసుల్లో ఇతను ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. 1998 నాటి కృష్ణ జింకల వేట కేసు నేపథ్యంలో నటుడు సల్మాన్ ఖాన్‌ను బెదిరించడం ద్వారా ఈ గ్యాంగ్ ఎక్కువగా వార్తల్లోకి వచ్చింది. ఇటీవలి కాలంలో సల్మాన్ ఖాన్‌తో పాటు బాలీవుడ్ ప్రముఖులు, వ్యాపారవేత్తలను టార్గెట్ చేస్తూ వీరి పేరుతో బెదిరింపులు, కాల్పుల ఘటనలు జరుగుతున్నాయి. లారెన్స్ బిష్ణోయ్ 'బిష్ణోయ్' సామాజిక వర్గానికి చెందినవారు. ఈ కమ్యూనిటీ ప్రకృతిని, ముఖ్యంగా కృష్ణ జింకలను పవిత్రంగా భావిస్తుంది. సల్మాన్ ఖాన్ తమ మనోభావాలను దెబ్బతీశాడన్న కోపంతో ఈ గ్యాంగ్ అతన్ని లక్ష్యంగా చేసుకుంది.

రచయితలకు ఆహ్వానం!
మీ ఆలోచనలకు అక్షరరూపం ఇవ్వండి..
మీ రచనలు, కథలు, కవితలు, వ్యాసాలు, సామాజిక అంశాలపై మీ అభిప్రాయాలను ఆర్యాద్వి పత్రిక ద్వారా పాఠకులకు చేరవేయండి.
మీ రచనలకు మా వేదికపై ప్రత్యేక స్థానం కల్పిస్తాం.
ఆసక్తి ఉన్న రచయితలు తమ రచనలను మాకు పంపించండి


పంపాల్సిన చిరునామా:
వాట్సాప్ నంబర్:
9912456573

# అంబరాన్నంటేలా విజయదశమి ఉత్సవాలు

## కేస్లాపూర్ వీరాంజనేయ స్వామి ఆలయంలో భారీ ఏర్పాట్లు





విజయదశమి (దసరా) పండగను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్ శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ ప్రాంగణం అత్యంత వైభవంగా ముస్తాబైంది. ఈనెల 20న (మంగళవారం) సాయంత్రం 5:00 గంటల నుంచి ప్రారంభమయ్యే విజయదశమి ఉత్సవాల కోసం ఆలయ నిర్వహణ కమిటీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు పూర్తి చేశారు.

### భక్తుల సౌకర్యార్థం విస్తృత ఏర్పాట్లు

వేడుకల నిర్వహణ కోసం ఆలయ ప్రాంగణాన్ని సమతలం చేసి ప్రత్యేక వేదికను సిద్ధం చేశారు. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టాలైన శమీ వృక్ష పూజ, రావణ దహన కార్యక్రమాల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. ఆలయ ప్రాంగణం నుంచి ప్రధాన ముఖద్వారం వరకు కంటికి ఇంపుగా విద్యుత్ దీపాలంకరణ, కాషాయ తోరణాలు, షామియానాలను ఏర్పాటు చేశారు. ఈ ఏర్పాట్లను ఆలయ కమిటీ ప్రముఖులు క్షేత్రస్థాయిలో ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.

### స్థానిక పరిపాలనా యంత్రాంగం సహకారం

ఉత్సవాల దృష్ట్యా ఆసిఫాబాద్ మున్సిపాలిటీ అధికారులు ఆలయ మార్గంలోని పెద్దవాగు వంతెన వరకు ప్రత్యేక విద్యుత్ దీపాలు, పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. అలాగే రాజంపేట పంచాయతీ పరిధిలో రహదారిని, బూరుగూడ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఆలయ పరిసరాలను శుభ్రపరిచి విద్యుత్ దీపాలను అమర్చారు.

### శమీ పూజ, రావణ దహనం

దసరా పర్వదినాన ఉదయం నుంచే ఆలయానికి భక్తులు, వాహన పూజలు నిర్వహించే వారి తాకిడి ఎక్కువగా ఉండనుంది. దీనిని దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక షామియానాలు, వసతులు, తీర్థ ప్రసాదాలను సిద్ధం చేశారు.

### సాయంత్రం 5:15 గంటలకు

ఆలయ ప్రధాన అర్చకులు శిరీష్ శర్మ గారి పౌరోహిత్యంలో సాంప్రదాయబద్ధంగా శమీ వృక్ష (జమ్మి) పూజను నిర్వహిస్తారు.

**ప్రత్యేక వేదికపై:** ప్రముఖ కళాకారులచే స్వాగత కార్యక్రమం, శ్రీరామచంద్రుని పాత్ర ఎంపిక, వచ్చిన ప్రముఖులకు స్వాగత సత్కారాలు ఉంటాయి.

### రాత్రి 7:30 గంటలకు

విజయాభిరాముని విజయాన్ని పురస్కరించుకుని రావణాసురుని దిష్టిబొమ్మ దహన కార్యక్రమాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అనంతరం ప్రముఖ కళాకారులచే అలరించే సాంస్కృతిక ప్రదర్శనలు ఉంటాయి. వేడుకలకు విచ్చేసే వేలాది మంది భక్తుల కోసం తాగునీరు, ప్రసాద వితరణ తదితర సౌకర్యాలను ఏర్పాట్లు చేశారు. ఈ మహోత్సవంలో ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కమిటీ సభ్యులు కోరారు.






# జాతీయ సెలక్షన్ కమిటీలో రమేశ్ పవార్

**సెలక్టర్‌గా మాజీ భారత స్పిన్నర్ నియామకం**

**కమిటీ ఛైర్మన్‌గా ప్రజ్ఞాన్ ఓజా కొనసాగింపు**

**2027 వన్డే ప్రపంచకప్ వరకు ప్రస్తుత కమిటీకి ప్రాధాన్యం**

బెంగళూరు: భారత పురుషుల సీనియర్ క్రికెట్ జాతీయ సెలక్షన్ కమిటీలో మాజీ స్పిన్నర్ రమేశ్ పవార్‌కు చోటు లభించింది. కమిటీ తాత్కాలిక ఛైర్మన్‌గా వ్యవహరిస్తున్న ప్రజ్ఞాన్ ఓజా ఇకపై కూడా ఆ బాధ్యతల్లో కొనసాగనున్నారు. ఈ మేరకు భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సోమవారం ప్రకటించింది. గత ఛైర్మన్ అజిత్ అగార్కర్ పదవీకాలం అక్టోబర్ 4తో ముగియడంతో సెలక్షన్ కమిటీలో మార్పులు చేపట్టింది. రమేశ్ పవార్ నియామకాన్ని క్రికెట్ సలహా కమిటీ (సీఏసీ) ఏకగ్రీవంగా సిఫారసు చేసినట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. మాజీ క్రికెటర్లు అశోక్ మల్హోత్రా, జతిన్ పరాంజపే ఈ కమిటీలో సభ్యులుగా ఉన్నారు. సీనియారిటీ ప్రాతిపదికన ప్రజ్ఞాన్ ఓజా సెలక్షన్ కమిటీకి నేతృత్వం వహిస్తారని సైకియా తెలిపారు. 2027 వన్డే ప్రపంచకప్ వరకు కమిటీలో కొనసాగింపునకు ప్రాధాన్యమిచ్చినట్లు సమాచారం.

### ఆటగాడిగా, కోచ్‌గా గుర్తింపు

48 ఏళ్ల రమేశ్ పవార్ భారత్ తరఫున రెండు టెస్టులు, 31 వన్డేలు ఆడారు. దేశవాళీ క్రికెట్‌లో ముంబయి తరఫున ఆడిన ఆయన 148 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌ల్లో 470 వికెట్లు పడగొట్టడంతోపాటు 4,245 పరుగులు సాధించారు. భారత మహిళల జట్టుకు ప్రధాన కోచ్‌గా పనిచేసిన సమయంలో 2022 ఆసియా కప్ టైటిల్, కామన్వెల్త్ క్రీడల్లో రజత పతకం సాధించడంలో కీలక పాత్ర పోషించారు. ముంబయి, గుజరాత్ జట్లకు కోచ్‌గా వ్యవహరించడంతోపాటు బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో బౌలింగ్ కోచ్‌గా సేవలందించారు.

### అగార్కర్ సేవలకు బీసీసీఐ ప్రశంసలు

కొత్త సెలక్టర్ ఎంపికలో భాగంగా అక్టోబర్ 15న ముంబయిలోని బీసీసీఐ ప్రధాన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ ప్రక్రియలో సలీల్ అంకోలా, వసీం జాఫర్, జాకబ్ మార్టిన్, కానర్ విలియమ్స్ కూడా పాల్గొన్నారు. చివరకు పవార్‌ను ఎంపిక చేశారు. 2023 జులైలో సెలక్షన్ కమిటీ ఛైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అజిత్ అగార్కర్ భారత క్రికెట్‌కు విశేష సేవలందించారని బీసీసీఐ ప్రశంసించింది. ఆయన పదవీకాలంలో భారత జట్టు మూడు ఐసీసీ ట్రోఫీలు, రెండు ఆసియా కప్ టైటిళ్లు, వరుసగా రెండు ఆసియా క్రీడల స్వర్ణ పతకాలు సాధించినట్లు పేర్కొంది. సెలక్షన్ కమిటీ సభ్యులు: ప్రజ్ఞాన్ ఓజా (ఛైర్మన్), శివ్ సుందర్ దాస్, ఆర్‌పీ సింగ్, అజయ్ రాత్రా, రమేశ్ పవార్.

# భారత షట్లర్లకు సవాల్‌గా ఫ్రెంచ్ ఓపెన్

- నేటి నుంచి సూపర్ 750 టోర్నీ
- తొలి రౌండ్‌లో అగ్రశ్రేణి షట్లర్ అన్ సె యంగ్‌తో సింధు ఢీ
- లక్ష్యసేన్‌కు నరావోకాతో పోరు
- విజయాల బాట పట్టాలని సాత్విక్-చిరాగ్ జోడీ పట్టుదల



**పారిస్:** ఇటీవలి టోర్నీల్లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయిన భారత బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఫ్రెంచ్ ఓపెన్‌లో సత్తా చాటేందుకు సిద్ధమయ్యారు. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న ఈ సూపర్ 750 టోర్నీలో మొత్తం 9.5 లక్షల డాలర్ల ప్రైజ్‌మనీ అందుబాటులో ఉంది. పీవీ సింధు సహా భారత షట్లర్లు తమ ఆటతీరును మెరుగుపరుచుకొని కీలక విజయాలు సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగుతున్నారు.

### సింధుకు అన్ సె యంగ్ సవాల్

రెండుసార్లు ఒలింపిక్ పతక విజేత పీవీ సింధుకు తొలి రౌండ్‌లోనే కఠిన ప్రత్యర్థి ఎదురుకానుంది. దక్షిణ కొరియాకు చెందిన టాప్ సీడ్ అన్ సె యంగ్‌తో ఆమె తలపడనుంది. గత డెన్మార్క్ ఓపెన్‌లోనూ వీరిద్దరి మధ్య మ్యాచ్ ఖరారైనప్పటికీ, సీడెడ్ క్రీడాకారులు చివరి నిమిషంలో తప్పుకోవడంతో డ్రా మారింది. దీంతో సింధు జర్మనీకి చెందిన యెవోన్ లీతో ఆడాల్సి వచ్చింది. ఆ మ్యాచ్‌లో సింధు తొలి రౌండ్‌లోనే ఓటమి పాలైంది. ఈసారి యంగ్‌ను ఎదుర్కొని ముందడుగు వేయాలంటే సింధు తన ప్రదర్శనను గణనీయంగా మెరుగుపరుచుకోవాల్సి ఉంటుంది.

### లక్ష్యసేన్‌కు పాత ప్రత్యర్థి

పురుషుల సింగిల్స్‌లో ఆరో సీడ్ లక్ష్యసేన్ జపాన్ ఆటగాడు కొడాయ్ నరావోకాతో తొలి రౌండ్‌లో తలపడనున్నాడు. వెన్నునొప్పి నుంచి కోలుకున్న లక్ష్యసేన్ ఆసియా క్రీడల్లో పురుషుల టీమ్ విభాగంలో భారత్‌కు కాంస్య పతకం అందించడంలో కీలక పాత్ర పోషించాడు. గతంలో నరావోకాపై విజయం సాధించిన అతడు మరోసారి అదే ప్రత్యర్థిని ఎదుర్కోనున్నాడు. మాజీ ప్రపంచ నంబర్‌వన్ కిదాంబి శ్రీకాంత్ కూడా మెరుగైన ప్రదర్శనతో తిరిగి పుంజుకునే ప్రయత్నంలో ఉన్నాడు. ఇటీవల ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ అలెక్స్ లానియర్‌కు గట్టి పోటీ ఇచ్చిన శ్రీకాంత్.. ఈసారి భారత యువ ఆటగాడు ఆయుష్ శెట్టితో తలపడనున్నాడు.

### సాత్విక్-చిరాగ్ జోడీపై ఆశలు

పురుషుల డబుల్స్‌లో సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి-చిరాగ్ శెట్టి జోడీపై అందరి దృష్టి నెలకొంది. ఈ ఏడాది సింగపూర్, చైనా టోర్నీల్లో టైటిళ్లు సాధించిన ఈ జంట ఆసియా క్రీడల్లో అనూహ్యంగా ముందుగానే నిష్క్రమించింది. ఈ నిరాశను అధిగమించి తిరిగి విజయాల బాట పట్టాలని భావిస్తోంది. తొలి రౌండ్‌లో ఫ్రాన్స్‌కు చెందిన క్రిస్టో పొపోవ్, తోమా జూనియర్ పొపోవ్ సోదరులతో తలపడనుంది. ఈ ఏడాది ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో తొలిసారి కాంస్య పతకం సాధించిన మహిళల డబుల్స్ జోడీ త్రీసా జాలీ-గాయత్రి గోపీచంద్ కూడా బరిలోకి దిగనుంది. తైవాన్‌కు చెందిన లిన్ చిహ్-చున్, యాంగ్ చు-యున్ జోడీతో ఈ భారత జంట పోటీపడనుంది.

### మహిళల సింగిల్స్‌లో భారత పోరు

మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో భారత క్రీడాకారిణులు పలు కీలక మ్యాచ్‌లు ఆడనున్నారు. తన్వి శర్మ, ఇషారాణి బారువా పరస్పరం తలపడనుండగా, అశ్మిత చలిహా చైనాకు చెందిన హాన్ కియాన్ షితో పోటీపడనుంది. ఉన్నతి హుడా జపాన్ క్రీడాకారిణి రికో గుంజీని ఎదుర్కోనుంది. దేవికా సిహాగ్‌కు ఇండోనేషియాకు చెందిన ఐదో సీడ్ పుత్రి కుసుమ వార్దానీ ప్రత్యర్థిగా నిలవనుంది.

# సర్ఫరాజ్ ఖాన్ సెంచరీ

**హిమాచల్‌పై ముంబై 258 పరుగుల ఆధిక్యం**

**నిషాంత్ సింధు ఆల్‌రౌండ్ షో.. రెండు రోజుల్లోనే హర్యానా ఘన విజయం**



**బిలాస్‌పూర్/రోహ్‌తక్:** రంజీ ట్రోఫీ గ్రూప్-డి మ్యాచ్‌ల్లో ముంబై, హర్యానా జట్లు సత్తాచాటాయి. హిమాచల్‌ప్రదేశ్‌పై ముంబై భారీ ఆధిక్యంతో దూసుకెళ్తుండగా.. చండీగఢ్‌పై హర్యానా ఇన్నింగ్స్ 24 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. హర్యానా ఆల్‌రౌండర్ నిషాంత్ సింధు బ్యాటింగ్, బౌలింగ్‌లో అదరగొట్టాడు. ముంబైతో జరిగిన మ్యాచ్‌లో హిమాచల్‌ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 140 పరుగులకే కుప్పకూలగా.. ముంబై రెండో రోజు ఆట ముగిసే సమయానికి నాలుగు వికెట్లకు 398 పరుగులు చేసింది. సర్ఫరాజ్ ఖాన్ 213 బంతుల్లో 18 ఫోర్లతో 139 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఆకాష్ ఆనంద్ 58 పరుగులతో అతడికి అండగా నిలిచాడు. ఐదో వికెట్‌కు వీరిద్దరూ అజేయంగా 176 పరుగులు జోడించారు. దీంతో ముంబయికి 258 పరుగుల ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 12 పరుగులతో ఆట కొనసాగించిన కెప్టెన్ సిద్ధేశ్ లాడ్ 87 పరుగులు చేసి ఔటయ్యాడు. ముషీర్ ఖాన్ 57 పరుగులు సాధించాడు. సోమవారం ముంబయి 87 ఓవర్లలో రెండు వికెట్లు కోల్పోయి 291 పరుగులు జోడించింది. హిమాచల్ బౌలర్లలో అభిషేక్ కుమార్, జితేందర్ రాణా రెండేసి వికెట్లు పడగొట్టారు. అంతకుముందు తుషార్ దేశ్‌పాండే నాలుగు వికెట్లతో హిమాచల్‌ను దెబ్బతీశాడు.

### సింధు ఆల్‌రౌండ్ ప్రదర్శన

రోహ్‌తక్‌లో చండీగఢ్‌పై హర్యానా ఇన్నింగ్స్ 24 పరుగుల తేడాతో గెలిచింది. తొలుత చండీగఢ్ 103 పరుగులకు ఆలౌటైంది. అనంతరం హర్యానా తొలి ఇన్నింగ్స్‌లో 245 పరుగులు చేసింది. నిషాంత్ సింధు 92, యశ్‌వర్ధన్ దలాల్ 95 పరుగులతో రాణించారు. దీంతో హర్యానాకు 142 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్‌లో చండీగఢ్ 118 పరుగులకే పరిమితమైంది. ఎడమచేతి వాటం స్పిన్నర్ నిషాంత్ సింధు 27 పరుగులిచ్చి ఆరు వికెట్లు పడగొట్టి ప్రత్యర్థి పతనాన్ని శాసించాడు. కనిష్క్ చౌహాన్ మూడు వికెట్లు తీశాడు. చండీగఢ్ కెప్టెన్ మన్‌దీప్ వోహ్రా 47 పరుగులతో టాప్ స్కోరర్‌గా నిలిచాడు. ఇక చెన్నైలో జరిగిన మ్యాచ్‌లో తమిళనాడు తొలి ఇన్నింగ్స్‌లో 313 పరుగులు చేసింది. ప్రదోష్ రంజన్ పాల్ 136, బాబా ఇంద్రజిత్ 77 పరుగులు సాధించారు. ఉత్తరాఖండ్ తొలి ఇన్నింగ్స్‌లో 134 పరుగులకు ఆలౌటై, రెండో ఇన్నింగ్స్‌లో ఏడు ఓవర్లకు వికెట్ నష్టానికి 9 పరుగులు చేసింది. మయాంక్ మిశ్రా ఐదు వికెట్లు పడగొట్టాడు. జైపూర్‌లో రాజస్థాన్ 497 పరుగుల భారీ స్కోరు సాధించింది. సచిన్ యాదవ్, కరణ్ లాంబా చెరో 194 పరుగులు చేశారు. రైల్వేస్ తొలి ఇన్నింగ్స్‌లో ఒక వికెట్‌కు 46 పరుగులు చేసింది.

## 'డ్రాగన్'లో ఎన్టీఆర్‌పై భారీ సాంగ్..



యంగ్ టైగర్ ఎన్టీఆర్, దర్శకుడు ప్రశాంత్ నీల్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న చిత్రం 'డ్రాగన్'పై అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ సినిమాలో ఎన్టీఆర్‌ను నీల్ ఎలా చూపించబోతున్నారనే ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. తాజాగా ఈ సినిమా షూటింగ్‌కు సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలు తెరపైకి వచ్చాయి. కొంత విరామం తర్వాత అక్టోబర్ 15న ఎన్టీఆర్ తిరిగి షూటింగ్‌లో పాల్గొన్నట్లు సమాచారం. ప్రస్తుతం కీలకమైన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నట్లు తెలుస్తోంది. ఎన్టీఆర్‌తో పాటు ఇతర ప్రధాన తారాగణం కూడా ఈ షెడ్యూల్‌లో పాల్గొంటున్నట్లు ప్రచారం జరుగుతోంది. కథలో కీలకమైన సన్నివేశాలను పూర్తి చేసేందుకు చిత్ర బృందం కసరత్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ షెడ్యూల్ అనంతరం హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో మరో కీలక షెడ్యూల్ ప్రారంభం కానున్నట్టు తెలుస్తోంది. అక్కడ ప్రత్యేకంగా నిర్మిస్తున్న భారీ సెట్‌లో పాటను చిత్రీకరించనున్నారని టాక్. ప్రధానంగా ఎన్టీఆర్‌పై పాటను తెరకెక్కించేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అయితే పాటకు సంబంధించిన వివరాలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. మరోవైపు 'డ్రాగన్'లో ప్రశాంత్ నీల్ తనదైన విజువల్ శైలికి భిన్నంగా ప్రయోగం చేయనున్నారనే ప్రచారం ఆసక్తిని రేకెత్తిస్తోంది. 'కేజీఎఫ్', 'సలార్' చిత్రాల్లో ముదురు రంగులు, చీకటి నేపథ్యాలతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నీల్.. ఈ సినిమాలో ఫ్లాష్‌బ్యాక్ సన్నివేశాలను రంగులమయంగా చూపించనున్నట్లు సినీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ వార్త నిజమైతే కథలో గతానికి సంబంధించిన సన్నివేశాలు భిన్నమైన అనుభూతిని అందించే అవకాశముంది. అయితే ఈ వివరాలపై అధికారిక స్పష్టత రావాల్సి ఉంది.

హాట్ స్టార్!




## 'బ్లడీ రోమియో'.. షూటింగ్ షురూ!

నేచురల్ స్టార్ నాని, 'ఓజీ' ఫేమ్ దర్శకుడు సుజీత్ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న స్టైలిష్ యాక్షన్ చిత్రం 'బ్లడీ రోమియో' షూటింగ్ ప్రారంభమైంది. ఇప్పటికే ఈ సినిమాపై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొనగా.. తాజాగా షూటింగ్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలు తెరపైకి వచ్చాయి. సినిమా కోసం న్యూఢిల్లీలో సుమారు వారంపాటు ప్రత్యేక షెడ్యూల్ నిర్వహించనున్నట్లు సమాచారం. అక్కడ కీలక సన్నివేశాలను చిత్రీకరించిన అనంతరం చిత్ర బృందం హైదరాబాద్‌కు తిరిగి రానున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సినిమా ఇంటర్వెల్ ఎపిసోడ్‌పై దర్శకుడు సుజీత్ ప్రత్యేక దృష్టి సారించినట్లు ప్రచారం జరుగుతోంది. ఇంటర్వెల్‌లో వచ్చే భారీ యాక్షన్ ఫైట్‌ను ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేసేలా రూపొందించాలని ఆయన ప్రణాళిక సిద్ధం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఆ ఫైట్ సన్నివేశాలనే చిత్రీకరిస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. నిహారిక ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై వెంకట్ బోయనపల్లి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రవీణ్ లక్కరాజు సంగీతం అందిస్తున్నారు.

ఈ భారీ యాక్షన్ డ్రామాలో మలయాళ నటుడు పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. ఇక ఈ చిత్రంలో నాని సరసన నటించే కథానాయిక ఎవరనే విషయంపై ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు. చిత్ర బృందం ఈ వివరాలను వెల్లడించాల్సి ఉంది. అన్నీ అనుకున్నట్లు జరిగితే 'బ్లడీ రోమియో'ను 2027 వేసవిలో ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని మేకర్స్ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. నాని, సుజీత్ కలయికలో వస్తున్న చిత్రం ఎలాంటి యాక్షన్ హంగులతో అలరించనుందో చూడాలి.






## హోంబలే ఫిల్మ్స్‌తో అజిత్ సినిమా?

దక్షిణాది చిత్ర పరిశ్రమలో స్టార్ హీరోగా గుర్తింపు తెచ్చుకున్న అజిత్ కుమార్ ప్రస్తుతం కార్ రేసింగ్‌పై దృష్టి సారిస్తున్నారు. మరోవైపు, తన తదుపరి సినిమాల విషయంలోనూ ఆసక్తికరమైన వార్తలు వినిపిస్తున్నాయి. 'గుడ్ బ్యాడ్ అగ్లీ' దర్శకుడు ఆధిక్ రవిచంద్రన్‌తో అజిత్ ఓ సినిమాను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ చిత్రానికి అజిత్ భార్య నిర్మాణ బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా, అజిత్ తదుపరి ప్రాజెక్ట్‌కు సంబంధించి కోలీవుడ్ వర్గాల్లో ఓ ఆసక్తికరమైన ప్రచారం జరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్‌తో అజిత్ ఓ సినిమా చేయనున్నారనేది ఈ వార్తల సారాంశం. అయితే దీనిపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. 'కేజీఎఫ్', 'సలార్'వంటి భారీ చిత్రాలను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్.. అగ్ర హీరోలు, దర్శకులతో భారీ ప్రాజెక్టులను రూపొందిస్తూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది. ఈ సంస్థతో అజిత్ సినిమా చేయనున్నారనే వార్త నిజమైతే, ఈ ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో భారీ అంచనాలు ఏర్పడే అవకాశం ఉంది. అయితే ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్ట్‌కు దర్శకుడు ఎవరనే విషయం కూడా ఆసక్తికరంగా మారింది. అజిత్ ఇమేజ్‌కు సరిపోయే కథతో పాటు, భారీ స్థాయి యాక్షన్ అంశాలు ఉన్న చిత్రాన్ని తెరకెక్కించే దర్శకుడి కోసం అభిమానులు ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం ప్రచారంలో ఉన్న ఈ వార్తలపై అజిత్ లేదా హోంబలే ఫిల్మ్స్ నుంచి స్పష్టత రావాల్సి ఉంది. అధికారిక ప్రకటన వెలువడితేనే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తెలిసే అవకాశం ఉంది.

### -టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల కేసు-

## కోటాలో ముగ్గురి అరెస్టు

బాలీవుడ్ హీరో టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటనలో కీలక పరిణామం చోటుచేసుకుంది. దాడికి పాల్పడినట్లు అనుమానిస్తున్న ముగ్గురు నిందితులను ముంబై క్రైం బ్రాంచ్ పోలీసులు రాజస్థాన్‌లోని కోటాలో రైలులో ప్రయాణిస్తున్న సమయంలో అదుపులోకి తీసుకున్నారు. నిందితుల్లో ఇద్దరు హర్యానాకు చెందినవారు కాగా, మరొకరు మహారాష్ట్ర వాసి. వీరికి లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్నట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైనట్లు సమాచారం.



ముంబైలోని జూహూ ప్రాంతంలో ఆదివారం సాయంత్రం టైగర్ ష్రాఫ్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కాల్పులు జరిపిన విషయం తెలిసిందే. ఘటనలో హీరో సురక్షితంగా బయటపడగా, ఆయన డ్రైవర్‌తోపాటు మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. దాడికి తామే బాధ్యులమంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్ పేరుతో సోషల్ మీడియాలో ప్రకటన వెలువడింది. అయితే, దాని విశ్వసనీయతను పోలీసులు ఇంకా నిర్ధారించాల్సి ఉంది. దాడికి ముందే నిందితులు టైగర్ ష్రాఫ్ కదలికలపై నిఘా పెట్టినట్లు తెలుస్తోంది. ప్రతి ఆదివారం ఆయన ఫుట్‌బాల్ గ్రౌండ్‌కు వస్తారనే సమాచారంతో దాడికి ప్రణాళిక రూపొందించినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. శిక్షణ పొందిన షూటర్లు హీరోను హత్య చేసేందుకు పథకం రచించారా? అనే కోణంలోనూ దర్యాప్తు సాగుతోంది. కాల్పుల అనంతరం నిందితులు ఎస్వీ రోడ్డు మీదుగా విలే పార్లే, అంధేరీ వైపువెళ్లి, అంధేరీ వెస్ట్ రైల్వేస్టేషన్ సమీపంలో బైక్‌ను వదిలేశారు. అక్కడి నుంచి రైలు ఎక్కి మహారాష్ట్ర దాటి గుజరాత్ మీదుగా రాజస్థాన్‌లోని కోటాకు చేరుకున్నట్లు సమాచారం. తొలుత జూహూ పోలీసులు నమోదు చేసిన కేసును ముంబై క్రైం బ్రాంచ్‌కు బదిలీ చేశారు. భారతీయ న్యాయ సంహితలోని హత్యాయత్నం సెక్షన్ 109(1), ఉమ్మడి నేర ఉద్దేశానికి సంబంధించిన సెక్షన్ 3(5), ఆర్మ్స్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## బాలయ్య-కొరటాల సినిమాపై అప్‌డేట్

నందమూరి బాలకృష్ణ హీరోగా దర్శకుడు కొరటాల శివ తెరకెక్కించనున్న సినిమాపై ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన రెగ్యులర్ షూటింగ్ డిసెంబర్ మొదటి వారంనుంచి ప్రారంభం కానున్నట్లు సమాచారం. భారీ యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్‌కు ప్రాధాన్యమిస్తూ ఈ సినిమాను పవర్‌ఫుల్ మాస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందించనున్నట్లు తెలుస్తోంది. బాలయ్య మాస్ ఇమేజ్‌కు తనదైన శైలిలో సామాజిక సందేశాన్ని జోడించేందుకు కొరటాల శివ సిద్ధమవుతున్నారట. ముఖ్యంగా ఇంటర్వెల్ ఎపిసోడ్‌ను ప్రేక్షకులకు గుర్తుండిపోయేలా తీర్చిదిద్దనున్నట్లు ప్రచారం జరుగుతోంది. భారీ యాక్షన్ సీక్వెన్స్‌తోపాటు కథను కీలక మలుపు తిప్పే షాకింగ్ ట్విస్ట్ కూడా ఎపిసోడ్‌లో ఉంటుందని టాక్ వినిపిస్తోంది. కొరటాల శివ సినిమాల్లో కథతో పాటు కథా నేపథ్యానికి కూడా ప్రత్యేక ప్రాధాన్య ముంటుంది. ఆయన తెరకెక్కించిన చిత్రాల్లో ఆయా ప్రాంతాల జీవనశైలి, అక్కడి సామాజిక పరిస్థితులను బలంగా ఆవిష్కరించడం కనిపిస్తుంది. ఇప్పుడు బాలకృష్ణతో చేయనున్న సినిమా కోసం ఎలాంటి నేపథ్యాన్ని ఎంచుకున్నారన్నది ఆసక్తికరంగా మారింది. ఈ చిత్రంలో కుటుంబ భావోద్వేగాలు కూడా కథలో కీలక పాత్ర పోషించనున్నట్లు తెలుస్తోంది.'దేవర'తర్వాత కొరటాల శివ రూపొందించనున్న చిత్రం కావడంతో కథ, పాత్రల రూపకల్పనపై ఆయన ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు సమాచారం. బాలకృష్ణ ఇమేజ్‌కు సరిపోయేలా కథను సిద్ధం చేస్తున్నారనే ప్రచారం అభిమానుల్లో అంచనాలను పెంచుతోంది.




## బతుకమ్మలో.. తెలంగాణ సెలబ్రిటీ కోడలు

విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటించిన 'రణబాలి' థియేటర్లలో సందడి చేస్తోంది. రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో వచ్చిన ఈ చారిత్రక యాక్షన్ డ్రామా అక్టోబర్ 16న విడుదలైంది. 'గీతా గోవిందం', 'డియర్ కామ్రేడ్' తర్వాత ఈ జంట కలిసి నటించిన మూడో చిత్రమిది, పెళ్లి తర్వాత తొలి చిత్రం కూడా. ఇప్పటివరకు చేసిన పాత్రలకు భిన్నంగా, దేశభక్తి నేపథ్యమున్న కొత్త తరహా పాత్రలో విజయ్ ఒదిగిపోయారని, యువ హీరోలు సాహసించని పాత్రను ఎంచుకున్నారని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. తొలి రోజు భారత్‌లో రూ.9.25 కోట్ల నెట్ వసూలు చేసిన ఈ చిత్రం, రెండో రోజు ముగిసేసరికి రూ.15 కోట్ల మార్కు దాటింది. అయితే విమర్శకుల నుంచి మిశ్రమ స్పందన వచ్చింది. మరోవైపు ఈ స్టార్ జంట తెలంగాణ సంస్కృతిలోనూ మమేకమైంది. ఆదివారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్ వద్ద రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో విజయ్, రష్మిక పాల్గొన్నారు. గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా, మంత్రులు కూడా హాజరయ్యారు. వివాహం తర్వాత తెలంగాణ సంప్రదాయాలను పాటించాలని రష్మికకు ముందే చెప్పానని విజయ్ తెలిపారు. పెళ్లి తర్వాత ఇదే తన తొలి బతుకమ్మ అని, తాను "తెలంగాణ కోడలినని" రష్మిక ఆనందం వ్యక్తం చేశారు. ఈ వేడుకల్లో వారిద్దరి సందడి సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది.

